సూర్య
నేటి దినపత్రిక
18వ వసంతంలోకి...
www.suryaa.com
ఎన్టీఆర్ - కృష్ణా
మంగళవారం 11 ఫిబ్రవరి 2025
పేజీలు 8



# పొరపాట్లకు తావులేదు

- పటిష్ట ప్రణాళికతో ఎన్నిక నిర్వహణకు సిద్ధం కండి
- కృష్ణాజిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ డీకే బాలాజీ.

వివరాలు 2 లో

పేదల బియ్యం

# పక్కదారి పట్టకూడదు



- అవకతవకలకు ఆస్కారం లేకుండా నిరంతర తనిఖీలు
- ఉల్లంఘనలకు పాల్పడితే చట్టపరంగా కఠిన చర్యలు
- ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ

**విజయవాడ బ్యూరో, మేజర్ న్యూస్ :** ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా పంపిణీ చేసే పేదల బియ్యం పక్కదారి పట్టకుండా పటిష్ట నిఘా పెట్టడం జరిగిందని.. ఎక్కడా అవకతవకలకు ఆస్కారం లేకుండా ముమ్మరంగా తనిఖీలు చేపడుతున్నట్లు కలెక్టర్ డా. జి.లక్ష్మీశ తెలిపారు. సోమవారం కలెక్టర్ డా. జి.లక్ష్మీశ అధికారులతో కలిసి భవానీపురంలో సెంట్రల్ వేర్ హౌసింగ్ కార్పొరేషన్ (సీడబ్ల్యూసీ) గోదామును తనిఖీ చేశారు. కస్టమ్ మిల్లడ్ రైస్ (సీఎంఆర్)లో పీడీఎస్ బియ్యం ఏమైనా కలిశాయా.. లేదా? నిర్దేశ ప్రమాణాల ప్రకారమే మిల్లులు సీఎం ఆర్ కింద బియ్యం ఇస్తున్నాయా.. లేదా? అనేదాన్ని నిర్ధారించే రైస్ ఏజ్ టెస్ట్, నాణ్యతా పరీక్షల ప్రక్రియను పరిశీలించారు. సరకు నిల్వ పరిమాణాలతో పాటు రికార్డులను పరిశీలించారు. అనంతరం విజయవాడ అర్బన్ పరిధి సీతారాంపురంలోని 2లో..

ఎమ్మెల్యే స్పందించకుంటే..

# మరణమే శరణ్యం

- చెయ్యి తడపందే పని నడవదా..?
- ఎమ్మెల్యేని అడ్డంపెట్టుకుని పబ్బం గడుపుతున్న స్థానిక నాయకులు
- రెవెన్యూ అధికారులను సైతం లెక్కచేయని చోటా నాయకుడు
- స్థానిక టీడీపీ చోట నాయకుడి నిర్వాకం!



**కృత్తివెన్ను, ఫిబ్రవరి 10 మేజర్ న్యూస్ :** గ్రామంలో ఏ చిన్న పని జరగాలన్న స్థానికంగా ఉన్న చోటామోటా నాయకులను ప్రసన్నం చేసుకోవాల్సిందేనని మండలంలోని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గరిసపూడి పంచాయతీ దోమనగోంది గ్రామానికి చెందిన ఓ నాయకుడు పంచాయతీలో జరిగే ప్రతి పనిని తన దృష్టికి తీసుకు రావాల్సిందేనని హుకుం జారీ చేస్తున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. దోమనగొంది గ్రామానికి చెందిన ఒక చిన్న రైతు తన 70 సెంట్లు పొలాన్ని చెరువుగా మార్చుకునేందుకు ప్రయత్నం చేస్తుంటే రెవెన్యూ అధికారులను పంపించి నా వద్దకు రాకుండా నా అనుమతి లేకుండా చెరువు తవ్వడం ఏంటని నిలదీయడమే కాకుండా ఆ పనులను వెంటనే నిలిపివేయించారని అ రైతు తీవ్ర స్థాయిలో ఆరోపణలు చేస్తున్నారు. దీనిపై రెవెన్యూ అధికారులకు సమస్యను విన్నవించగా లోకల్‌గా ఉన్న నాయకులను ప్రసన్నం చేసుకోవాల్సిందిగా తెలిపారని వాపోయారు. ఎందుకు ఇలా చేస్తున్నారని గ్రామంలోనే కొందరి పెద్దల వద్ద ఆ రైతు ఆవేదన వ్యక్తం చేయగా నా అనుమతి లేకుండా ఈ పంచాయతీలో ఎవరు ఏ పని చేసిన ఊరుకునేది లేదంటూ గట్టిగానే చెబుతున్నట్లు సమాచారం.

గతంలో సుమారు 6 ఎకరాల ప్రభుత్వ భూమిని సైతం అక్రమంగా పలువురు గ్రామస్తులకు కేటాయించడమే కాకుండా వారి వద్ద నుంచి నగదు వసుళ్ళు చేసినట్లు సమాచారం. ఎవరు ఏ చిన్న పని జరిగించాలన్న ప్రభుత్వ కార్యాలయాల్లో ఎపని జరగాలన్న తనను ముందుగా కలవాల్సిందే లేనిపక్షంలో ఆ పని అంతటితో ముగించుకోవలసిన పరిస్థితులు ఉన్నాయని గ్రామస్తులు తీవ్ర ఆరోపణ చేస్తున్నారు. అంతేకాదు డ్వాక్రా గ్రూపుల్లో సైతం తన ముద్ర ఉండేలా ప్రయత్నాలు చేస్తూ పలువురు మహిళలను సైతం ఇబ్బందులకు గురి చేస్తున్నట్లు డ్వాక్రా సంఘాల వారు ఆవేదన చెందుతున్నారు. మిగతా 2లో

16న ఎన్టీఆర్ జిల్లా జనసేన పార్టీ

# ఆత్మీయ సమావేశం

వివరాలు 2లో



- జిల్లాలో రోజురోజుకు జనసేన పార్టీ బలోపేతం అవుతుంది
- పవన్ కళ్యాణ్ సిద్ధాంతాలకు అనుగుణంగా పనిచేసేవారిని పార్టీలోకి ఆహ్వానిస్తున్నాం
- ఎన్టీఆర్ జిల్లా జనసైనికులు, వీరమహిళలకు ఆహ్వానం
- ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షులు సామినేని ఉదయభాను







# నిలువు దోపిడి

- కాంట్రాక్టర్లతో కుమ్మక్కైన ఆలయ అధికారులు
- చేసేది ఏమీ లేక లబోదిబోమంటున్న భక్తులు

2లో

**పెనుగంచిప్రోలు ఫిబ్రవరి 10 మేజర్ న్యూస్ :** జిల్లాలోనే అత్యంత ప్రాముఖ్యత కలిగిన దేవాలయాల్లో పెనుగంచిప్రోలు శ్రీ తిరుపతమ్మ అమ్మవారి దేవస్థానం ఒకటి. తిరుపతమ్మ అమ్మవారి ఈ ప్రాంత ఇలవేల్పుగా భక్తుల కోరికలు తీర్చే మహిమగల దేవతగా భక్తులు నిత్యం ఆరాధిస్తూ ఉంటారు. అలాంటి అమ్మవారి దేవాలయంలో కొంత మంది కాంట్రాక్టర్లు కాసులకు కక్కుర్తి పడి భక్తులను

# పొరపాట్లకు తావులేదు



**మచిలీపట్నం, మేజర్ న్యూస్ :** ఎటువంటి పొరపాట్లకు తావు లేకుండా అధికారులు సమన్వయంతో శాసనమండలి పట్టభద్రుల నియోజవర్గ ఎన్నికను విజయవంతం చేయాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ డీకే బాలాజీ అన్నారు. కృష్ణా- గుంటూరు జిల్లాల శాసనమండలి పట్టభద్రుల నియోజ వర్గానికి జిల్లాలో నిర్వహించే పోలింగ్ నేపథ్యంలో సోమవారం జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ డీకే బాలాజీ, జిల్లా ఎస్పీ ఆర్ గంగాధర్ రావుతో కలిసి నోడల్ అధికారులతో కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో ప్రత్యేక సమావేశం నిర్వహిం చారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ భారత ఎన్నికల సంఘం మార్గ దర్శకాలు, నియమ నిబంధనలను పాటిస్తూ పక్కా ప్రణాళికతో లోటు పాట్లకు తావు లేకుండా ఎన్నికల ప్రక్రియను విజయవంతం చేయాలన్నారు. సాధారణ ఎన్నికలకు వర్తించే నిబంధనలు శాసనమండలి ఎన్నికలకు వర్తిస్తాయన్నారు. ఎన్నికల విధుల్లో నిర్లక్ష్యం వహించకుండా అప్రమత్తంగా ఉండాలన్నారు. పూర్తిగా బ్యాలెట్ విధానంలో నిర్వహించే ఎన్నికకు పోలింగ్ కేంద్రాల్లో అన్ని ఏర్పాట్లు పూర్తి చేసి సిద్ధం చేయాలన్నారు. నామినేషన్ల స్వీకరణ, లెక్కింపు ప్రక్రియ గుంటూరులో నిర్వహిస్తారని, పోలింగ్ నిర్వహణలో భాగంగా జిల్లాలో నిర్వహించే పోలింగ్‌కు 77 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. పట్టభద్రుల ఎన్నికలకు 63 వేల 114 మంది ఓటర్లుగా నమోదై ఉన్నారని వీరిలో 36,321 మంది పురుషులు 27,789 మంది మహిళలు, నలుగురు ఇతర కేటగిరికి చెందినవారుగా ఉన్నారన్నారు. ఈనెల 27 న నిర్వహించే పోలింగ్‌కు చేయవలసిన ఏర్పాట్లను సమావేశంలో చర్చించారు. జిల్లాలోని మూడు రెవెన్యూ డివిజన్ పరిధిలో డిస్ట్రిబ్యూషన్, రిసెప్షన్, టెంపరరీ స్ట్రాంగ్ రూమ్స్ కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నామని అన్నారు. మచిలీపట్నం రెవెన్యూ డివిజన్ కు మచిలీపట్నం నోబుల్ కళాశాల, గుడివాడ రెవెన్యూ డివిజన్ కు రెవెన్యూ డివిజనల్ కార్యాలయం గుడివాడ, ఉయ్యూరు రెవెన్యూ డివిజన్లో రెవెన్యూ డివిజనల్ కార్యాలయం ఉయ్యూరులో డిస్ట్రిబ్యూషన్, రిసెప్షన్, టెంపరరీ స్ట్రాంగ్ రూమ్‌లు ఉంటాయన్నారు ఆయా కేంద్రాల్లో పోలింగ్ మెటీరియల్ ను పోలింగ్ స్టేషన్లకు తరలించేందుకు రూట్ మ్యాప్ సిద్ధం చేసుకోవాలన్నారు. 77 పోలింగ్ కేంద్రాల్లో నిర్వహించే పోలింగ్‌కు 250 బ్యాలెట్ బాక్సులను సిద్ధంగా ఉంచామన్నారు. 77 మంది ప్రిసైడింగ్ అధికారులు, 77 మంది సహాయ ప్రిసైడింగ్ అధికారులు, 154 మంది ఇతర పోలింగ్ ఆఫీసర్లు, రిజర్వుడిగా ఉంచిన 77 మందితో కలిపి మొత్తం 462 మందిని నియమించడం జరిగిందన్నారు. వీరందరికీ ఈనెల 12వ తేదీన శిక్షణ ఇవ్వటం జరుగుతుందన్నారు. డిస్ట్రిబ్యూషన్ సెంటర్ నుండి పోలింగ్ కేంద్రాలకు మెటీరియల్ తరలింపు, పోలింగ్ అనంతరం బ్యాలెట్ బాక్సులను టెంపరరీ స్ట్రాంగ్ రూమ్స్ తరలించేటప్పుడు అధికారులు అత్యంత జాగరూ కతతో ఉండాలన్నారు. ఎటువంటి చిన్న పొరపాట్లకు తావు లేకుండా జిల్లాలో పోలింగ్ ప్రక్రియను విజయవంతం చేయాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ డీకే బాలాజీ నోడల్ అధికారులను ఆదేశించారు. జిల్లా ఎస్పీ ఆర్. గంగాధర్ రావు మాట్లాడుతూ ఈనెల 27న నిర్వహించే పోలింగ్‌కు పటిష్ట బందోబస్తు ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. నోటిఫికేషన్ జారీ తేదీ నుండి ప్రవర్తన నియమావళిని పటిష్టంగా అమలు చేస్తున్నామన్నారు. మోడల్ కోడ్ ఆఫ్ కాంటాక్ట్ అమలు చేసేందుకు ప్రత్యేక టీమ్స్ లతో పాటు, ఫ్లయింగ్ స్క్వాడ్ టీమ్స్, స్టాటిక్ సర్వేలెన్సు టీమ్స్, వీడియో సర్వేలెన్స్ టీమ్లను ఏర్పాటు చేసి పర్యవేక్షిస్తున్నామన్నారు. సబ్ డివిజన్ వారీగా ఇంటర్ డిస్ట్రిక్ట్ చెక్ పోస్టులను ఏర్పాటు చేసి గట్టి నిఘా ఉంచామన్నారు. క్రిటికల్ పోలింగ్ స్టేషన్లుగా గుర్తించిన వాటిలో పటిష్ట బందోబస్తు తో పాటు, ఎటువంటి అవకతవకలు జరగకుండా కొట్టుదిట్టమైన నిఘా ఏర్పాటు చేస్తున్నామని జిల్లా ఎస్పీ ఆర్. గంగాధర్ రావు అన్నారు. సహాయ రిటర్నింగ్ అధికారి, జిల్లా రెవెన్యూ అధికారి కె. చంద్రశేఖర రావు మాట్లాడుతూ పోలింగ్ మెటీరియల్ పంపిణీతో పాటు పోలింగ్ అనంతరం బ్యాలెట్ బాక్స్ లను టెంపరరీ స్ట్రాంగ్ రూముల కు తరలించేటప్పుడు ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. ఉదయం ఎనిమిది గంటలకు ప్రారంభం అయ్యే పోలింగ్‌కు ఏర్పాట్లను ముందుగానే సిద్ధం చేసేలా అధికారులను ఆదేశించామన్నారు. పోలింగ్ సిబ్బందికి ఈనెల 12వ తేదీన శిక్షణ ఇచ్చి సిద్ధం చేస్తున్నామని డిఆర్ఓ అన్నారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ గీతాంజలి శర్మ, ఆర్డీవోలు జి. బాలసుబ్రమణ్యం, కె. స్వాతి, బివిస్ హెలా షేరన్, అడిషనల్ ఎస్పీ వి. వి. నాయుడు, నోడల్ ఆఫీసర్లు ఉన్నారు.

## పటిష్ట ప్రణాళికతో ఎన్నిక నిర్వహణకు సిద్ధం కండి

### కృష్ణాజిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ డీకే బాలాజీ



## పేదల బియ్యం పక్కదారి పట్టకూడదు

(మొదటిపేజీ తరువాయి)

నెం. 225 చౌక ధరల దుకాణాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. లైసెన్సు, ఆన్‌లైన్ ప్రకారం స్టాక్ వివరాలు, సరుకు నాణ్యతతో పాటు డీలరు సక్రమంగా రికార్డులు నిర్వహిస్తున్నారా లేదా అనే విషయాలను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ లక్ష్మీశ మాట్లాడుతూ మిల్లులు సీఎంఆర్ కింద ఇచ్చే బియ్యంలో రీసైకిల్ చేసిన పీడీఎస్ బియ్యం కలిపేటువంటి అక్రమాలకు అడ్డుకట్ట వేసేందుకు పటిష్ట నిఘా ఏర్పాటు చేయడం జరిగిందని.. ప్రతి బఫర్ గోదామును ఎప్పటికప్పుడు తనిఖీ చేస్తున్నట్లు తెలిపారు. అదేవిధంగా రేషన్ దుకాణాలు, ఎంఎల్ఎస్ పాయింట్లు, ఎండీయూ ఆపరేటర్ల కార్యకలాపాలు తదితరాలను తనిఖీ చేయాలని అధికారులను ఆదేశించినట్లు వెల్లడించారు. జిల్లాలోని 957 రేషన్ దుకాణాలను, ఏడు ఎంఎల్ఎస్ పాయింట్లలో ఎప్పటికప్పుడు తనిఖీలు చేపట్టి, నివేదికలు సమర్పించాలని స్పష్టం చేశారు. పౌర సరఫరాల డిప్యూటీ తహసీల్దార్లు ప్రతినెలా 20 దుకాణాలను తనిఖీ చేయాల్సిందేనని.. అదేవిధంగా తహసీల్దార్లు నెలకు అయిదు దుకాణాలను తనిఖీ చేయాలన్నారు. పౌర సరఫరాల డీఎం, జిల్లా పౌర సరఫరాల అధికారి ఎంఎల్ఎస్ పాయింట్లను తనిఖీ చేయాలన్నారు. పేదల ఆహార భద్రతకు భరోసా కల్పించేలా అమలవుతున్న పీడీఎస్ బియ్యంలో ఒక్క గింజ పక్కదారి పట్టినా సహించేది లేదని.. ఉల్లంఘనలపై చట్టపరంగా కఠిన చర్యలు తప్పవని కలెక్టర్ లక్ష్మీశ హెచ్చరించారు. కలెక్టర్ వెంట పౌర సరఫరాల జిల్లా మేనేజర్ ఎం. శ్రీనివాసు, డీఎస్‌వో ఎ. పాపారావు తదితరులు ఉన్నారు.

## ఎమ్మెల్యే స్పందించకుంటే..మరణమే శరణ్యం

(మొదటిపేజీ తరువాయి)

దీనిపై పంచాయతీలోని ప్రజలు ఆ నాయకుడి పై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నట్లు తెలుస్తుంది. ఎవరైనా తన మాట వినకపోతే వారిపై లేనిపోని కేసులు పెట్టి పోలీస్ వారితో వేధిస్తున్నారని ఇలాంటి నాయకుడిపై స్థానిక ఎమ్మెల్యే చర్యలు తీసుకోవాలని లేదంటే ఈ చోటా నాయకుడి ఆగడాలను తట్టుకోలేక మరణమే శరణ్యం అంటూ పలువురు వాపోయారు.

## నిలువు దోపిడి

(మొదటిపేజీ తరువాయి)

నిలువదోపిడి చేస్తూ తమ జేబులు నింపుకొంటూ ఆలయ ఆదాయానికి గండి కొడుతూ భక్తుల జేబులకు చిల్లులు పెడుతున్న వైనం దేవస్థానం ప్రాంగణంలో కనిపిస్తూ ఉంటుంది. ఆలయ అధికారులకు సమాచారం ఇచ్చినప్పటికీ పెడచెవిన పెట్టడంతో చేసేది ఏమీ లేక భక్తులు లబోదిబోమంటున్నారు. భక్తుల సౌకర్యార్థం దేవదాయ శాఖ వారు కొన్ని రకాల అవసరాలకు వస్తువులను విక్రయించేందుకు ధరలను నిర్ణయించడం జరుగుతుంది. కానీ కాంట్రాక్టర్లు దేవదాయ శాఖ వారు నిర్ణయించిన ధరలకు అమ్మకుండా అధిక ధరలకు వస్తువులను విక్రయిస్తూ భక్తులను నిలువు దోపిడీ చేస్తున్నారు అని ఆరోపణలు బాగా వినిపిస్తున్నాయి. అమ్మవారికి సమర్పించే పొంగళ్ళు, మట్టి కుండలు కట్టెలు కొబ్బరికాయలు, పూజా సామాగ్రిలు, వాహనాల పూజలు, పార్కింగ్ లు టాయిలెట్స్ తదితర వస్తువుల విక్రయాలకు ఆలయం వారు నిర్ణయించిన ధరలకంటే ఎక్కువ ధరలకు విక్రయిస్తున్నట్లుగా భక్తుల ఆరోపిస్తున్నారు. రేపటి నుండి ఐదు రోజుల పాటు జరిగే తిరుపతమ్మ అమ్మవారి కళ్యాణ మహోత్సవం పెద్ద కళ్యాణం సందర్భంగా వివిధ ప్రాంతాల నుండి అధిక సంఖ్యలో భక్తులు పాల్గొనే అవకాశం ఉన్నందున వారి నుండి కాంట్రాక్టర్లు ఎక్కువగా దోపిడీకి పాల్పడే అవకాశం ఉందని కనుక ఇప్పటికైనా ఆలయ అధికారులు అన్ని శాఖల అధికారులతో సమన్వయం పరుచుకొని దేవదాయ శాఖ వారు నిర్ణయించిన ధరలకే భక్తుల అవసరమైన వస్తువులను విక్రయించే విధంగా చర్యలు తీసుకోవాలని భక్తులు కోరుతున్నారు.

### విద్యార్థులు చిన్ననాటి నుంచే

## ఆర్థిక క్రమశిక్షణ అలవరచుకోవాలి

### యూబీఐ డిప్యూటీ రీజనల్ హెడ్ హరీష్ బేతా

**విజయవాడ, ఫిబ్రవరి 10, మేజర్ న్యూస్ :** రానున్న పరీక్షల సీజనను దృష్టిలో ఉంచుకొని భారత ప్రభుత్వం ప్రధానమంత్రి నరేంద్ర మోదీ విద్యార్థులతో నిర్వహించిన పరీక్షా పే చర్చ – 2025 కార్యక్రమం ప్రత్యక్ష ప్రసార ప్రదర్శనను సోమవారం యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (యూబీఐ) విజయవాడ ప్రాంతీయ కార్యాలయం విజయవాడ, ప్రసాదంపాడులోని వివేకానంద ఇంగ్లిష్ మీడియం పాఠశాలలో ఏర్పాటు చేసింది. ఈ కార్యక్రమంలో భాగంగా ప్రధాన మంత్రి భారతదేశంలోని వివిధ పాఠశాలలకు చెందిన విద్యార్థులతో సంభాషించారు. పరీక్షలకు ముందు ఒత్తిడిని అధిగమించడానికి వారికి ప్రేరణాత్మక చిట్కాలను అందించారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని పరిమితంగా ఉపయోగించడం, వాతావరణ మార్పులపై అవగాహన, నాయకత్వ లక్షణాలపై కూడా ప్రధానమంత్రి విద్యార్థులకు సూచనలిచ్చారు. పీఎం సంభాషణ తర్వాత వివేకానంద ఇంగ్లిష్ మీడియం స్కూల్ విద్యార్థులను ఉద్దేశించి యూబీఐ డిప్యూటీ రీజనల్ హెడ్ హరీష్ బేతా మాట్లాడుతూ విద్యార్థులందరూ తమ కెరీర్‌లో గౌరవ ప్రధాని సలహాలను పాటించి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ప్రోత్సహించారు. విద్యార్థులు కూడా చిన్నతనం నుంచే పొదుపు అలవాటు, ఆర్థిక క్రమశిక్షణను అలవరచుకోవాలన్నారు.

# 16న ఎన్టీఆర్ జిల్లా జనసేన పార్టీ ఆత్మీయ సమావేశం



**విజయవాడ, మేజర్ న్యూస్ :** గాంధీ నగర్‌లోని ప్రెస్ క్లబ్‌లో ఎన్టీఆర్ జిల్లా జనసేన పార్టీ అధ్యక్షులు సామినేని ఉదయభాను ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఈ నెల ఫిబ్రవరి 16వ తేదీన ఎన్టీఆర్ జిల్లా జనసేన విస్తృతస్థాయి ఆత్మీయ సమావేశం ఏర్పాటు చేస్తున్నామని, ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నాగబాబు పాల్గొంటారని తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 16వ తేదీన విజయవాడలో జరగనున్న ఎన్టీఆర్ జిల్లా జనసేన పార్టీ సమావేశానికి నియోజకవర్గ నుంచి భారీ ఎత్తున జనసైనికులు హాజరు కావాలని పిలుపునిచ్చారు. ఈనెల 16 జరగనున్న ఎన్టీఆర్ జిల్లా జనసేన పార్టీ మీటింగ్ గురించి ఎన్టీఆర్ జిల్లాలోని ప్రతి నియోజకవర్గంలో సన్నాహక సమావేశాలు ఏర్పాటు చేయనున్నట్లు తెలియజేశారు. జిల్లా, మండల, గ్రామ, వార్డు నాయకులతో పాటు జనసేన అభిమానులు ఈ కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. జనసేన పార్టీ అధినేత ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ పిలుపునిచ్చిన ప్రతి కార్యక్రమం ఎన్టీఆర్ జిల్లాలో క్షేత్రస్థాయిలో గ్రామస్థాయిలో కూడా విస్తృతంగా ప్రజల్లోకి తీసుకువెళ్లామని పేర్కొన్నారు. ప్రజా సమస్యలు పరిష్కారమే లక్ష్యంగా అధికారు లతో ప్రజలతో మమేకమై జనసేన నేతలు గ్రామస్థాయిలో కృషి చేస్తున్నారని తెలిపారు. పవన్ కళ్యాణ్ నాయకత్వంలో పార్టీని మరింత బలోపేతం చేసే విధంగా కృషి చేస్తున్నామన్నారు. సామాన్యుడికి అందుబాటులో ఉండే విధంగా జనసేన పార్టీ నాయకులు కార్యకర్తలు పని చేస్తున్నారని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ రాష్ట్ర కార్యదర్శి, విజయవాడ తూర్పు నియోజకవర్గం జనసేన పార్టీ సమన్వయకర్త అమ్మిశెట్టి వాసు, జనసేన పార్టీ రాష్ట్ర కార్యదర్శి ఏపీఐఐసీ డైరెక్టర్ మండలి రాజేష్, జనసేన పార్టీ అధికార ప్రతినిధి, మైలవరం నియోజకవర్గం ఇంచార్జ్ అక్కల గాంధీ, తిరువూరు నియోజకవర్గ జనసేన పార్టీ సమన్వయకర్త మనుబోలు శ్రీనివాసరావు, జనసేన పార్టీ ఆంధ్ర జోన్ కన్వీనర్ శ్రీబాడిత శంకర్, వీర మహిళ మల్లెపు విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థులు భవిష్యత్తుపై మంచి ప్రేరణ కలిగి ఉండాలి



## జిల్లా బీసీ సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ జి రమేష్

**గన్నవరం, ఫిబ్రవరి 09, మేజర్ న్యూస్ :** విద్యార్థులు భవిష్యత్తు పై మంచి ప్రేరణ కలిగి ఉండాలని జిల్లా బీసీ సంక్షేమ శాఖ ఉప సంచాలకులు జి రమేష్ విద్యార్థులకు సూచించారు. గన్నవరం లో ఆదివారం 10వ తరగతి హాస్టల్ విద్యార్థులకు, బీసీ సంక్షేమ అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో ప్రేరణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ఉపసంచాలకుడు రమేష్ ముఖ్య అతిథి గా హాజరైన, ప్రేరణ తరగతులను మహాత్మ జ్యోతిరావు పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి, జ్యోతి ప్రజ్వలనతో కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా రమేష్ మాట్లాడుతూ,10 వ తరగతిలో విద్యార్థులు మంచి జీవి తం కోసం ప్రేరణ కలిగి ఉండాలన్నారు. ప్రభుత్వ పాఠశాలలతో పాటు బీసీ వసతి గృహాల్లో ఉన్నతమైన సౌకర్యాలు అందుబాటులో ఉన్నాయని, అనుభ వమైన ఉపాధ్యాయులతో పాటు అన్ని రకాల పుస్తకాలు, స్నాక్స్ ఆల్ ఇన్ వన్ లాంటి స్టడీ మెటీరియల్స్‌ను, విద్యార్థులకు క్రమం తప్పకుండా అందిస్తున్నామన్నా రు. హాస్టల్‌లో ఉండే విద్యార్థుల కోసం, ప్రత్యేక స్టడీ హావర్స్, ప్రత్యేక టుటర్స్‌లను నియమించి అనుభవం గల నిపుణులతో ప్రేరణ తరగతులు నిర్వహిస్తు న్నామని తెలిపారు. జీవితంలో మంచి భవిష్యత్‌కు పదవ తరగతి కీలకం అన్నారు. పదవతరగతి లో ఉన్న సబ్జెక్టలను నిర్లక్ష్యం చేయొద్దని, పదవ తరగతి సబ్జెక్ట్ కేంద్ర, రాష్ట్ర స్థాయిలో ఉండే సివిల్స్, గ్రూప్ 1, 2, 3 లాంటి పరీక్షలు ఉపయోగపడతాయన్నారు. పరీక్షలకు కొన్ని రోజులే సమయం ఉన్నందున సమయాన్ని వృథా చేయవద్దన్నారు. టీవీ, ఫోన్, సోషల్ మీడియాలు లాంటి వాటికి దూరంగా ఉండాలన్నారు. గ్రూప్‌ల విద్యార్థులను విభజించాలమని, వెనక బడిన గ్రూపు విద్యార్థుల పై ప్రత్యేక దృష్టి సారించా లన్నారు. పదో తరగతి విద్యార్థులు సమన్వయంతో చదువు కోవాలన్నారు. హాస్టల్‌లో విద్యార్థులను హాస్టల్ వార్డెన్‌లు, ఉదయం నిద్ర లేపి చదివించాలని, పరీక్షల సమయంలో విద్యార్థులను క్రమశిక్షణ గా ఉండేలా వార్డెన్‌లు బాధ్యత తీసుకోవాలన్నారు. 10వ తరగతిలో నూరు శాతం ఫలితాల లక్ష్యంగా విద్యా ర్థులు, వార్డెన్‌లు పని చేయాలన్నారు. కార్యక్రమంలో ఏ బి సి డబ్ల్యూ గుర వమ్మ, డివిజన్ లోని వార్డెన్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

# గ్రామంలో అత్యంత భక్తిశ్రద్ధలతో లోహమయ రాజగోపుర ప్రతిష్ట





**మచిలీపట్నం మేజర్ న్యూస్ :** గూడూరు మండలం,చిన్న ఆకుల మన్నాడు గ్రామంలో వేంచేసియున్న శ్రీ హనుమత్ సీతా లక్ష్మణ సమేత అభయ కోదండ రామస్వామి వారి దేవస్థానంలో రాజగో పుర ప్రతిష్ట మూడు రోజుల నుండి కార్యక్రమం కన్నుల పండుగగ వేదమంత్రాలు, సాంస్కృతిక కార్యక్రమాలు, కోలాటాలు, నృత్య ప్రదర్శనలు,భజనలతో రాజగోపుర ప్రతిష్ట అత్యంత భక్తిశ్రద్ధలతో జరిగింది. శత్రుఘ్న ఆచార్యుల ఆధ్వర్యంలో స్వామివారి రాజ గోపుర ప్రతిష్ట కార్యక్రమాన్ని నిర్వహిస్తూ ఈ కార్యక్రమం యొక్క విశిష్టతను భక్తులకు ఆయన తెలియజేశారు. మూడు రోజుల నుండి వేద పండితుల నడుమ జరిగిన ఈ కార్యక్రమంలో మొదటి రోజు సా యంత్రం కుంభాసాధన, నిత్య హోమం అంకురార్పణ పూజాక్రతువు జరిగింది. రెండవ రోజు ఉదయం రోజు అదివాసత్రయం, అదివాస హోమం,అజస్ర దీపా రాధన, అకల్మష హోమం, రెండవ రోజు సాయంత్రం మహాశాంతి హవనం ఇచ్చాది కార్యక్రమాలు భక్తిశ్రద్ధలతో జరిగాయి. మూడవ రోజు ఉదయం 8:48 నిమిషాలకు శిఖర ప్రతిష్ట, రాజగోపుర ప్రతిష్ట, తదనంతరం నాగరాజ స్వామి, గణేష్ స్వాముల శిలా విగ్రహ ప్రతిష్ట జరుగగా, హోమంలోని ఆఖరి ఘట్టం పూర్ణాహుతితో ఈ కార్యక్రమాన్ని ముగించారు. ఆలయ ప్రధాన అర్చకులు మాట్లాడుతూ ఈ లోహ దేవాలయ రాజగోపురంపై లోహమయ శిఖరాలను ఏర్పాటు చేసి ప్రత్యేక పూజలు చేసినట్లు ఆలయ ప్రధాన అర్చకులు తెలియజే శారు. సీతారామాలయ నూతన విగ్రహ ప్రతిష్ట కార్యక్రమాన్ని గత సంవత్సరం ఫిబ్రవరి అత్యంత వైభవపేతంగా నిర్వహించామని అన్నారు. లోహమయ్య రాజ గోపాల ప్రతిష్టను ఏర్పాటు చేయడం వలన గ్రామంలో ప్రతికూల శక్తులు విడిచి అనుకూల శక్తులను ఆకర్షించి గ్రామం అంతా సుభిక్షంగా ఉంటుందని శాస్త్రాలు,పురాణాలు చెబుతున్నాయని అన్నారు. ఈ కార్యక్రమంలో భక్తులు పాల్గొని భక్తిశ్రద్ధలతో స్వామివారి తీర్థ ప్రసాదాలు స్వీకరించారని తెలిపారు. శ్రీ హనుమత్ సీతా లక్ష్మణ సమేత అభయ కోదండ రామస్వామి వారి దేవస్థానం లో స్వామి వారి కళ్యాణ మహోత్సవం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమం అ నంతరం మహా అన్నదాన కార్యక్రమానికి వేలాది మంది భక్తులు తరలివచ్చా రు. ఈ కార్యక్రమంలో దేవస్థాన పాలకవర్గ సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# ఆలపాటి రాజేంద్రప్రసాద్ భారీ విజయమే లక్ష్యం



## గన్నవరం నియోజకవర్గ టిడిపి పరిశీలకులు వద్రాణం హరిబాబు నాయుడు

**గన్నవరం, ఫిబ్రవరి 10, మేజర్ న్యూస్ :** త్వరలో జరగనున్న ఉమ్మడి కృష్ణ, గుంటూరు జిల్లాల గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఎన్డీఏ కూటమి అభ్యర్థి ఆలపాటి రాజేంద్రప్రసాద్ భారీ విజయం సాధించే విధంగా ప్రతి ఒక్కరు కృషి చేయాలని గన్నవరం నియోజకవర్గ టీడీపీ పరిశీలకులు వద్రాణం హరిబాబు నాయుడు పేర్కొన్నారు. గత నాలుగు రోజులుగా గన్నవరం నియోజకవర్గ మండల కమిటీల నాయకులతో నిర్విరామంగా సమావేశాలు నిర్వహిస్తూ ప్రతి ఒక్కరిని గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికలకు సమాయత్తం చేస్తున్న ఎన్డీఏ కూటమి నాయకులు సోమవారం ఉదయం గన్నవరం గ్రామంలోని వివిధ పాఠశాలల్లో ఉపాధ్యాయులుగా పని చేస్తున్న వారిని కలిసి ఆలపాటి రాజేంద్రప్రసాద్ యొక్క ప్రచార కరపత్రాన్ని అందజేసి మొదటి ప్రాధాన్యత ఓటును ఆలపాటికి వేయాలని, భారీ మెజారిటీతో ఆలపాటిని పెద్దల సభకు పంపాలని కోరారు. ఈ సందర్భంగా వాద్రాణం హరిబాబు నాయుడు మాట్లాడుతూ గన్నవరం నియోజకవర్గంలో ఓటు హక్కు నమోదు చేసుకున్న గ్రాడ్యుయేట్ ఓటర్లను గుర్తించి వ్యక్తిగతంగా కలిసి ఎన్డీఏ కూటమి అనుసరిస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను వివరిస్తున్నామని, రానున్న ఎన్నికల్లో ఆలపాటి రాజేంద్రప్రసాద్ కు ఓటు వేయవలసిందిగా ప్రతి ఒక్క ఓటర్ ను కలుస్తామని తెలిపారు. ఎన్డీఏ కూటమి నాయకులు, కార్యకర్తలు ప్రతి ఒక్కరూ ప్రచార కార్యక్రమాల్లో పాల్గొని ఆలపాటి రాజేంద్రప్రసాద్ ను భారీ మెజారిటీతో పెద్దల సభకు పంపించాలని సూచించారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఎన్డీఏ కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత తొలిసారిగా జరుగుతున్న ఎన్నికల్లో గెలుపే ప్రాధాన్యతగా పక్కా వ్యూహాలను అమలు చేయాలని నాయకులకు కార్యకర్తలకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న గన్నవరం నియోజకవర్గ గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల పరిశీలకులు కోట వీరబాబు మాట్లాడుతూ విద్యావంతుడు, వినయశీలి, ప్రజా సమస్యల పట్ల పూర్తి అవగాహన కలిగి ఉన్న ఆలపాటి రాజేంద్రప్రసాద్ ను అత్యధిక మెజారిటీతో గెలిపించి పెద్దల సభకు పంపాలని ఓటు హక్కు కలిగిన ప్రతి ఒక్కరూ ఆలపాటికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని తెలిపారు. ఒక్క అవకాశం పేరుతో 2019లో అధికారంలోకి వచ్చిన వైసిపి రాష్ట్రాన్ని అంధకారంలోకి నెట్టివేసిందని ఇటీవల ఎన్డీఏ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఇటుక ఇటుక పేర్చుకుంటూ తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న రాష్ట్రాన్ని తిరిగి గాడిలో పెట్టే దిశగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు నాయకత్వంలో అభివృద్ధి జరుగుతుందని, ప్రతి ఒక్కరు ఎన్డీఏ కూటమి ప్రభుత్వానికి మద్దతు తెలియజేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో కృష్ణాజిల్లా తెలుగుదేశం పార్టీ ఉపాధ్యక్షులు గుజ్జర్లపూడి బాబురావు, గన్నవరం నియోజకవర్గ తెలుగు మహిళా అధ్యక్షురాలు మేడేపల్లి రమ, క్లస్టర్ ఇంచార్జి తంగిరాల శ్రీనివాసరావు, ఎన్డీఏ కూటమి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.



## స్మశానవాటిక అభివృద్ధికి దాతల సహకారం అభినందనీయం

**గన్నవరం (ఉంగుటూరు), ఫిబ్రవరి 10, మేజర్ న్యూస్ :** స్వగ్రామం పై మమకారంతో గ్రామంలోని స్మశాన వాటిక అభివృద్ధికి దాతల సహకారం అందించటం అభినందనీయమని మానికొండ గ్రామస్తులు కొనియాడారు. ఉంగుటూరు మండలం మానికొండకు చెందిన కీర్తిశేషులు సూరెడ్డి వెంకట రామయ్య జ్ఞాపకార్థం వారి కుటుంబీకులైన రాజేంద్ర ప్రసాద్, విష్ణులు రూ.7.50 లక్షలతో స్మశాన వాటికలో శుభ్రపరిచి స్నానాలు, కర్మలు చేయు టకు నూతన భవనాన్నినిర్మించారు. స్మశాన వాటిక అభివృద్ధి చేసిన దాత లను గ్రామస్తులు అభినందించారు.

## సేవా కార్యక్రమాలలో విశేషంగా పాల్గొనాలి

### వేములపల్లి దంపతులకు ఎస్. ఎస్.ఆర్. దంపతుల ఆశీర్వచనం



**అమరావతి మేజర్ న్యూస్ :** మంచి మిత్రుడు ఆధ్యాత్మిక కార్యక్రమాలలో విశేషంగా పాల్గొంటున్న వేములపల్లి వెంకట సీతారామయ్య, ఉమామహే శ్వరి దంపతుల వివాహ వార్షికోత్సవ కార్యక్రమం ఘనంగా జరిగింది. ఆ ధ్యాత్మిక సేవకులు ఎస్.ఎస్.ఆర్. ఆంజనేయులు జానకీ లక్ష్మి దంపతులు స్వయంగా బాచ్‌పల్లిలో వారి ఇంటికి వెళ్ళి వారికి శుభాకాంక్షలు అందచేశా రు. సేవా దృక్పథంతో ఆధ్యాత్మిక చింతనతో మరిన్ని సేవా కార్యక్రమాల్లో పాల్గొనాలని వారిని ఎస్. ఎస్. ఆర్. దంపతులు కోరారు. కైకలూరు నియో జకవర్గం దొడ్డిపట్లకు చెందిన వేములపల్లి సీతారామయ్య కుటుంబానికి ప్రజలతో మంచి సంబంధాలు, బంధు బలగం, రాజకీయ నేపథ్యం కూడా వున్నది. వారు హైదరాబాదు నగరంలోని బాచ్ పల్లిలో వుంటున్నారు.

## మనోస్ యూనిదాస్ సహకారం మరువలేనిది



**పెడన, మేజర్ న్యూస్ :** మనోస్ యూనిదాస్ సహ కారం ఎంతో మరువలేనిది అని ప్రేమాంజలి సోషల్ సర్వీస్ సెంటర్ కోఆర్డినేటర్ సిస్టర్ అన్నారు. ఈ సందర్భంగా ఆమె ఒక ప్రకటనలు మాట్లాడుతూ మనోస్ యూనిదాస్ మాతో ఉన్నందుకు మేము సంతోషిస్తున్నామని, చెబుతూ గత 4 నెలల పాటు టైలరింగ్ శిక్షణ, కంప్యూటర్ శిక్షణ పూర్తి చేసుకున్న 25 మంది ట్రైనీలకు టైలరింగ్, కంప్యూటర్ సర్టిఫికేట్ కూడా పంపిణీ చేశామన్నారు. ఈ నేపథ్యంలో ప్రేమాంజలి సామాజిక సేవా కేంద్రానికి మనోస్ చేసిన సహాయానికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

## చిన్నారులను ఆశీర్వదించిన ఎమ్మెల్యే కుమార్ రాజా



**పామర్రు ఫిబ్రవరి 10 మేజర్ న్యూస్:** పమిడిముక్కల మండలం వీరంకిలాకులోని శుభం కళ్యాణ మండపంలో సోమవారం జరిగిన యెందూరి పిచ్చేశ్వరరావు మనవరాండ్ర నూతన వస్త్ర బహూకరణ వేడుకలలో స్థానిక శాసన సభ్యుడు వర్ల కుమార్ రాజా పాల్గొని చిరంజీవులను ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే కుమా ర్ రాజాతో పాటు రాష్ట్ర గౌడ సంక్షేమ అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ వీరంకి వెంకట గురుమూర్తి, తెలుగుదేశం పార్టీ నాయకులు జక్కా శ్రీనివాసరావు, నాదెళ్ళ సుబ్రహ్మణ్యం, ఘంటా సురేష్ తదితరులు పాల్గొన్నారు.

## సింగిల్ యూస్ ప్లాస్టిక్ బ్యాన్‌పై విస్తృతంగా చర్యలు

### వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర



**విజయవాడ కార్పొరేషన్, మేజర్ న్యూస్ :** సింగిల్ యూస్ ప్లాస్టిక్ నిషేధంపై విస్తృతమైన చర్యలు చేపట్టాలని విజయవాడ నగర పాలక సంస్థ ధ్యానచంద్ర అన్నారు. సోమవారం ఉదయం శాఖాధిపతులతో సింగిల్ యూస్ ప్లాస్టిక్ నిషేధం పై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ప్రతి సర్కిల్లో సింగిల్ యూస్ ప్లాస్టిక్ బాన్ పై విస్తృతంగా అవగాహన కల్పించాలని దానికనుగుణంగా వినియోగదారులను గుర్తించి వారితో ఒక సమావేశం నిర్వహించి 120 మైక్రోన్స్ కంటే తక్కువగా ఉన్న ప్లాస్టిక్ వాడకని సంపూర్ణంగా నగరపాలక సంస్థ నిషేధిస్తోంది అన్న విషయాన్ని తెలపాలని అధికారులను ఆదేశించారు. ఒకసారి వాడి పడేసే ప్లాస్టిక్ వలన పర్యావరణానికి కాకుండా ఆరోగ్యానికి కూడా హాని కలుగుతుందని, కావున పర్యావరణ పరిరక్షణ, నగర పౌరుల ఆరోగ్యం కొరకు సింగిల్ యూస్ ప్లాస్టిక్ బ్యాన్ ను కచ్చితంగా అమలు చేయాలన్నారు. ఈ సమావేశంలో అడిషనల్ కమిషనర్ (ప్రాజెక్ట్) డాక్టర్ డి. చంద్రశేఖర్, చీఫ్ సిటీ ప్లానర్ జీవిజి ఎస్ వి ప్రసాద్, ఎంఆర్ చెయ్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ సురేష్ బాబు, డిప్యూటీ కమిషనర్ రెవెన్యూ సృజన, జోనల్ కమిషనర్ రమ్య కీర్తన, సూపరిండెంటింగ్ ఇంజనీర్ (ప్రాజెక్ట్స్) పి సత్యకుమారి, ప్రాజెక్ట్ ఆఫీసర్ (యు సి డి) పి వెంకటనారాయణ, అసిస్టెంట్ మెడికల్ హెల్త్ ఆఫీసర్లు, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు, అసిస్టెంట్ కమిషనర్లు, సిడి వోలు, తదితరులు పాల్గొన్నారు.

## భారీగా బోనాలు ఎత్తిన మహిళలు





**అమరావతి మేజర్ న్యూస్ :** హైదరాబాదు నగరంలోని నిజాంపేట్ శ్రీ భ్రమరాంబ సమేత మల్లిఖార్జున స్వామి, శ్రీ రేణుకా ఎల్లమ్మ తల్లి జాతరలో ఇసుకవేస్తే రాలనంత జనం పాల్గొన్నారు. మహిళలు పెద్ద ఎత్తున బోనాలు ఎత్తారు. దేవాలయం చుట్టూ వారు తిరుగుతుండగా వారిని పోతరాజు, గణాచారులు అనుసరించారు. తప్పెట్లు, గజ్జెల మోతతో వారు మై మరచిపోయారు.! చాలా మందికి పూనకాలు వచ్చాయి.

## మల్లన్న జాతర దర్శించిన ప్రావిడెంట్ ఫండ్ అధికారి, దంపతులకు సత్కారం



**అమరావతి మేజర్ న్యూస్ :** శ్రీ రేణుకా ఎల్లమ్మ, శ్రీ మల్లన్న 124 వ వార్షికోత్సవం, జాతర సందర్భంగా ఆధ్యాత్మిక సేవకులు ఎస్. ఎన్. ఆర్. ఆంజనేయులు సోదరి గుడ్లూరు వేంకటేశ్వరరావు కృష్ణ శ్రీ దంపతులను ఆలయ నిర్వాహకులు శాలువా కప్పి ఘనంగా సత్కరించారు. గుడ్లూరు వేంకటేశ్వర రావు ప్రావిడెంట్ ఫండ్ అధికారిగా పనిచేస్తున్నారు. వారు ఈ రోజు నిజాంపేట్ జాతర కార్యక్రమంలో పాల్గొన్నారు. ఒగ్గు పూజారుల ఆధ్వర్యంలో శ్రీ రేణుకా ఎల్లమ్మ తల్లికి, శ్రీ మల్లన్న స్వామికి వేరు వేరుగా కళ్యాణాలు నిర్వహించారు. వీరితోపాటు ఆధ్యాత్మిక సేవకులు ఎస్. ఎన్. ఆర్. ఆంజనేయులు, ఆలయ ప్రధాన అర్చకులు శ్రీధరమల్లె గౌతమ్ కుమార్ శర్మ తదితరులు పాల్గొన్నారు.

## నిజాంపేట్ మల్లన్న, రేణుకా ఎల్లమ్మ తల్లి జాతరలో పోతురాజు వీరంగం



**అమరావతి మేజర్ న్యూస్ :** ఆదివారం శ్రీ మల్లన్న, రేణుకా ఎల్లమ్మ తల్లి 124 వ వార్షికోత్సవంలో (జాతర) పోతురాజు విన్యాసం ప్రజలను బాగా ఆకట్టుకుంది. సాయంత్రం 5.30 గంటల సమయంలో పోతురాజు భయానక అలంకరణతో వీరంగం వేశాడు. దీంతో పెద్దలు, చిన్న పిల్లలు కూడా భయపడే విధంగా దేవాలయం ఆవరణ చుట్టూ తిరుగుతూ భక్తులను ఆకర్షించాడు. పెద్ద ఎత్తున తప్పెట్లు శబ్దంతో అలజడి సృష్టించారు. అందుకే దీనిని జాతర అన్నారు.

# దళిత ఆదివాసీ సాధికారత కొరకు ప్రత్యేక ప్రణాళికను రూపొందించాలి



### దళిత గిరిజన బడ్జెట్ వాచ్ రాష్ట్ర కన్వీనర్ అల్లడి దేవకుమార్

**విజయవాడ, మేజర్ న్యూస్ :** దళిత ఆదివాసీలకు కేటాయించిన బడ్జెట్టు ప్రభుత్వం సక్రమంగా అమలు చేయాలని వారి అభివృద్ధికి తోడ్పడాలని దళిత గిరిజన బడ్జెట్ వాచ్ రాష్ట్ర కన్వీనర్ అల్లడి దేవకుమార్ అన్నారు. విజయవాడలోని ప్రెస్ క్లబ్‌లో సోమవారం నిర్వహించిన జిల్లా స్థాయి దళిత గిరిజన బడ్జెట్ వాచ్ సదస్సుకు ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. 2014 – 15 నుంచి ఇప్పటివరకు రాష్ట్ర ప్రభుత్వం బడ్జెట్ కేటాయిస్తున్న ప్పటికీ వాటిని అమలు చేయడంలో ప్రభుత్వాలు శ్రద్ధ చూపడం లేదు అని, ఎస్సీ ఎస్టీలు సామాజికంగా ఆర్థికంగా వెనకబడి ఉన్నారని కారణంతో వాళ్ళని అభివృద్ధి వైపు నడిపించాలని ప్రధాన ఉద్దేశంతో ఏర్పాటు చేసిన ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్ చట్టం 2013ను సమర్థవంతంగా అమలు చేసి రాష్ట్రంలోని మారుమూల గ్రామాల్లో ఉన్న ప్రతి దళిత ఆదివాసీలను అభివృద్ధి వైపు నడిపించాల్సిన బాధ్యత ప్రభుత్వం పై ఉందని ఆయన అన్నారు. దళిత గిరిజన బడ్జెట్ వాచ్ జిల్లా సభ్యులు మాదగాని గురునాథం మాట్లాడుతూ ఎన్నో పోరాటాలు ఫలితంగా రూపొందించుకున్న ఎస్సీ ఎస్టీ సబ్ ప్లాన్ చట్టాన్ని ప్రభుత్వాలు చిన్నచూపు చూస్తున్నాయని దళిత ఆదివాసీలు అభివృద్ధి చెందాలంటే కేటాయించిన నిధులను కచ్చితంగా ఖర్చు చేసి దళిత ఆదివాసీల అభివృద్ధికి ప్రభుత్వాలు పాటుపడాలని అభిప్రాయపడ్డారు. బడ్జెట్ వాచ్ జిల్లా కన్వీనర్ జామి రమాదేవి మాట్లాడుతూ ఎస్సీ ఎస్టీల కోసం కేటాయించిన బడ్జెట్టు వారి సంక్షేమం కోసమే కేటాయించాలని,కేటాయించిన మొత్తాన్ని ఖర్చు చేయకపోతే మిగిలిపోయిన బడ్జెట్టు తదుపరి సంవత్సరానికి బదిలీ చేస్తూ కేటాయించాల్సిన బడ్జెట్ తో పాటుగా ఈ బడ్జెట్ ని కేటాయించి దళిత దళిత ఆదివాసీల సాధికారత కొరకు ప్రభుత్వాలు పాటుపడాలని అన్నారు. దళిత గిరిజన బడ్జెట్ వాచ్ రాష్ట్ర కోఆర్డినేటర్ డాక్టర్ రమణ మూర్తి మాట్లాడుతూ 1974– 75 సంవత్సరం నుండి ఈ దేశంలో ప్రధానంగా ఎస్సీ ఎస్టీల సాధికారత గురించి చర్చ జరిగినప్పటి నుంచి ఇప్పటివరకు అంటే 2013లో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం చట్టం చేసేంతవరకు ఎస్సీ, ఎస్టీల అభివృద్ధి గురించి వాళ్ళ సంక్షేమం గురించి ప్రభుత్వాలు పేపర్ల పేపర్లకు మాత్రమే పరిమితమై మాట్లాడిన సందర్భాలు ఉన్నాయి కానీ ఎప్పుడైతే చట్టం వచ్చిందో అప్పటి నుంచి ప్రతి పైసా ఎస్సీ ఎస్టీల కోసమే ఖర్చు చేయాల్సిన బాధ్యత ప్రభుత్వం పై ఉన్నది అయితే నేడు ప్రభుత్వాలు ఈ నిధులను వేరువేరు పథకాలకు మళ్లిస్తూ దళిత ఆదివాసీల సాధికారత కొరకు ఆలోచన చేయడంలో వెనకబడి ఉన్నాయి వారిని సమాజంలో అందరితోపాటు సమానంగా నిలబెట్టాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై ఉన్నందున ప్రతి సంవత్సరం కేటాయించే బడ్జెట్లో జనాభా ప్రకారం కేటాయించి వారి యొక్క సాధికారత వైపు ప్రయత్నం చేయాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. సమతా సైనిక్ దళ్ రాష్ట్ర అధ్యక్షురాలు శ్వేతా బుదుమూరి మాట్లాడుతూ కేటాయించిన బడ్జెట్టు వారి అభివృద్ధి కొరకే వాడాలని వాటిని పక్కదారి పట్టించకూడదని ప్రతి ఎస్సీ ఎస్టీ కుటుంబంలోని పిల్లలకు మంచి విద్యను అందించాలని అందుకొరకు ప్రత్యేకమైన ప్రణాళికలు రూపొందించి ఈ బడ్జెట్టు వారి కోసమే కేటాయించాలని అన్నారు. జిల్లా ప్రతినిధి రుక్మిణి మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీలు సామాజికంగా ఆర్థికంగా నేటికీ వివక్షకు గురవుతున్నారని చిన్న చూపుకి కారణం అవుతున్నారని ఈ రుగ్మతలు తొలగించాల్సిన బాధ్యత ప్రభుత్వం ఉందని, కేటాయించిన బడ్జెట్ని వాళ్ళ యొక్క సామాజిక ఆర్థిక స్థితిగతుల్లో మార్పు తీసుకురావటం కోసం ప్రభుత్వాలు పనిచేయాల్సిన ఆవశ్యకత ఉందని అభిప్రాయపడ్డారు. ఎమ్మార్పీఎస్ జిల్లా ప్రతినిధి జే యశ్వంత్ రాణి మాట్లాడుతూ స్వతంత్రం వచ్చి 75 సంవత్సరాలు పూర్తయినప్పటికీ ఎస్సీ ఎస్టీల అభివృద్ధి అమడ దూరంలోని ఆగిపోయింది, కేటాయించిన బడ్జెట్ని వేరువేరు కార్యక్రమాలకు మళ్లిస్తూ అవసరమైన చోట ఖర్చు చేయకుండా వారి యొక్క సాధారణ అవసరాన్ని గుర్తించకుండా నామమాత్రంగా డబ్బులు ఖర్చు చేస్తూ ఇలా అభివృద్ధికి ప్రత్యక్షంగా గాని పరోక్షంగాని ప్రభుత్వాలు ఆటంకాన్ని కల్పిస్తూ ఉన్నాయి అని అన్నారు. ఈ సమావేశానికి దళిత గిరిజన బడ్జెట్ వాచ్ జిల్లా సభ్యులు అమృత రావు, మాల మహానాడు ప్రతినిధి చంద్ర, ఎస్టి నాయకులు శంకర్, ఎన్జీవో ప్రతినిధి ప్రసాద్, డీబీఆర్సీ ప్రతినిధులు అనిత, మల్లేశ్వరి మొదలైన వారు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

# ధనియాలపేటలో పర్యటించిన ఎమ్మెల్యే వెనిగండ్ల

### సమస్యలు అడిగి తెలుసుకున్న ఎమ్మెల్యే

### తాగునీటి సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తెచ్చిన ప్రజలు.



**గుడివాడ, మేజర్ న్యూస్:** మీకోసం మీ వెనిగండ్ల కార్యక్రమం కింద ఎమ్మెల్యే వెనిగండ్ల రాము సోమవారం ధనియాలపేటలో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన ప్రజలను అడిగి సమస్యలు తెలుసుకున్నారు. తాగునీటి సమస్య తీవ్రంగా ఉందని, వాటర్ ట్యాంకు వస్తున్నా పూర్తిస్థాయిలో ప్రజలందరికీ నీరు అందడం లేదని ఏకరవు పెట్టారు. కాలనీవాసుల సమస్యలపై ఎమ్మెల్యే స్పందించి అమృత్ స్కీమ్ పథకంలో పెండింగ్ లో ఉన్న పైప్ కనెక్షన్ పనులు తక్షణమే ప్రారంభించాలంటూ మున్సిపల్ అధికారులకు సూచించారు. శివారు ప్రాంతాల్లో మున్సిపల్ పైప్ లీకేజీలను పరిశీలించి మరమ్మత్తులు చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. రాబోవు వేసవిని దృష్టిలో పెట్టుకుని గుడివాడ ప్రజలకు నీటి ఎద్దడి లేకుండా చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఆవిధంగా ప్రణాళికలు తయారు చెయ్యాలని అధికారులకు సూచనలు చేసారు. ఇంకా పలు సమస్యలను కాలనీ వాసులు ఎమ్మెల్యే దృష్టికి తెచ్చారు. ఎలాంటి సమస్యలు ఉన్నా తన దృష్టికి తెస్తే పరిష్కారానికి యుద్ధప్రాతిపదికన చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే వారికి అభయమిచ్చారు.

# అంతర్జాతీయ స్థాయిలో ఎదిగేందుకు శిక్షణకు ప్రభుత్వం నుండి సహకారం

### నాగిడి గాయత్రికి మంత్రి కొల్లు రవీంద్ర సత్కారం





**మచిలీపట్నం మేజర్ న్యూస్ :** నేషనల్ గేమ్స్‌లో కానో స్లాలోమ్ విభాగంలో గోల్డ్ మెడల్ సాధించిన నాగిడి గాయత్రిని రాష్ట్ర గనులు, భూగర్భ వనరులు, ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర అభినందించారు. మచిలీపట్నంలోని క్యాంపు కార్యాలయానికి వచ్చిన నాగిడి గాయత్రిని సత్కరించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. కృష్ణా జిల్లా నాగాయలంక అనే చిన్న గ్రామం నుండి జాతీయ స్థాయి క్రీడల్లో పాల్గొనడం, గోల్డ్ మెడల్ సాధించడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. పేద కుటుంబం నుండి వచ్చినప్పటికీ క్రీడల పట్ల ఉన్న మక్కువే ఈ స్థాయికి చేర్చిందన్నారు. 2018లో మచిలీపట్నంలో వాటర్ స్పోర్ట్స్ నిర్వహణ సమయంలో అన్ని సదుపాయాలు కల్పించామని తెలిపారు. కానీ, గత ఐదేళ్ల రాష్ట్రంలో క్రీడా రంగం నిర్లక్ష్యానికి గురైందని, అయినప్పటికీ గాయత్రి లాంటి వారిని చూస్తుంటే సంతోషంగా ఉందన్నారు.ఒక్కరే కాకుండా వారి కుటుంబం నలుగురు పతకాలు సాధించడం ఆనందంగా ఉందన్నారు. ప్రభుత్వ సహకారం, కుటుంబ సభ్యుల ప్రోత్సాహంతోనే ఇలాంటి విజయాలు సాకారమవుతాయన్నారు. అంతర్జాతీయ స్థాయిలో ఎదిగేందుకు అవసరమైన శిక్షణకు ప్రభుత్వం నుండి సహకారం అందిస్తానని అన్నారు. జర్మనీలో శిక్షణ తీసుకోవాలనుకున్న గాయత్రి కోరికను ముఖ్యమంత్రి దృష్టిలో పెట్టి అవసరమైన మేరకు స్పాన్సర్లను ఏర్పాటు చేస్తానని మంత్రి కొల్లు రవీంద్ర హామీ ఇచ్చారు.

# కూటమి ప్రభుత్వ ప్రగతికి పట్టభద్రులు ఓటు వేయాలి





**కూటమి ఎమ్మెల్సీ అభ్యర్థి ఆలపాటి రాజేంద్రప్రసాద్...**

**గుడ్లవల్లేరు ఇంజనీరింగ్ కళాశాల పట్టభద్రులతో సమావేశమైన అభ్యర్థి ఆలపాటి, కూటమినేతలు**

**మంచికోసం పనిచేసే ఆలపాటికి అత్యధిక మెజార్టీ యిద్దాం**

**ఎమ్మెల్యే వెనిగండ్ల విజ్ఞప్తి**

**గుడ్లవల్లేరు మేజర్ న్యూస్ :** ప్రజలు ఇచ్చిన చారిత్రాత్మకమైన తీర్పుతో... ప్రజలకు మంచి చేయాలనే సంకల్పంతో పనిచేస్తున్న కూటమి ప్రభుత్వ ప్రగతికి పట్టబద్రులు మద్దతుగా నిలవాలని ఉమ్మడి కృష్ణ,గుంటూరు జిల్లాల పట్టభద్రుల కూటమి ఎమ్మెల్సీ అభ్యర్థి ఆలపాటి రాజేంద్రప్రసాద్ విజ్ఞప్తి చేశారు. ఈనెల 27వ తేదీన పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ నేపథ్యం లో ఎమ్మెల్సీ ఎన్నికల్లో పట్టభద్రులు తనకు మద్దతు తెలపాలని విజ్ఞప్తి చేస్తూ... కూటమి అభ్యర్థి ఆలపాటి రాజేంద్రప్రసాద్ గుడ్లవల్లేరు ఇంజనీరింగ్ కళాశాలల ప్రాంగణంలో పట్టభద్రులతో సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా ఆలపాటి రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ... రాష్ట్ర ప్రగతి కోసం బాధ్యత కలిగిన పట్టబద్రులు విజ్ఞతతో ఆలోచించే సమయం మళ్లీ వచ్చిందన్నారు. ప్రజలు ఇచ్చిన చారిత్రాత్మకమైన తీర్పు ద్వారా అధికారంలోకి వచ్చి ప్రజల మంచి కోసం కూటమి ప్రభుత్వం చేస్తున్న కృషిలో భాగస్వామ్యం అయ్యేలా ఎమ్మెల్సీ ఎన్నికలో పట్టభద్రులు విజయాన్ని కట్టబెట్టాలని రాజేంద్రప్రసాద్ విజ్ఞప్తి చేశారు. ఎమ్మెల్యే వెనిగండ్ల రాము మాట్లాడుతూ.... మంచి వ్యక్తిత్వం కలిగిన ఆలపాటి రాజేంద్రప్రసాద్‌కు పట్టభద్రులు మద్దతుగా నిలవాలని.... సార్వత్రిక ఎన్నికల మాదిరిగానే శాసనమండలి ఎన్నికల్లో ఆయనకు అఖండ మెజార్టీ చేకూర్చాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఆలపాటిని గెలిపిస్తే గుడివాడ అభివృద్ధికి సహకరిస్తారని పట్టభద్రులకు ఎమ్మెల్యే రాము హామీ ఇచ్చారు. ఏపీ గ్రంథాలయ సంస్థ చైర్మన్ గోనుగుంట్ల కోటేశ్వరరావు, ఏపీ స్టేట్ వేర్ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ రావి వెంకటేశ్వరరావు, గుడివాడ జనసేన ఇన్చార్జి బూరగడ్డ శ్రీకాంత్ మాట్లాడుతూ... ఒకసారి అవకాశం ఇస్తే జగన్ రెడ్డి రాష్ట్రాన్ని ఏ విధంగా అధోగతి పాలు చేశారో మనమందరం చూసామన్నారు. మచ్చలేని ఆలపాటి రాజా లాంటి, నిబద్ధత గల మంచి వ్యక్తిని మండలిలోకి పంపేలా పట్టభద్రులందరూ 100% మొదటి ప్రాధాన్యత ఓటు వేసి ఆయనను గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో ఎన్టీఆర్ స్టేడియం కమిటీ వైస్ చైర్మన్ యలవర్తి శ్రీనివాసరావు, బిజెపి కన్వీనర్ దావులూరి సురేంద్రబాబు, గుడివాడ టిడిపి అధ్యక్షుడు దింట్యాల రాంబాబు, గుడ్లవల్లేరు మండల అధ్యక్షుడు కొసరాజు బాపయ్య చౌదరి,టిడిపి నాయకులు చాటగడ్డ రవి,పంద్రాజు సాంబయ్య, ఇంజనీరింగ్ కళాశాల కార్యదర్శి వేములపల్లి కోదండ రామయ్య, డైరెక్టర్ బి.కళ్యాణ్ కుమార్, ప్రిన్సిపల్ ఎస్ హెచ్ వి ప్రసాదరావు, గుడ్లవల్లేరు ఇంజనీరింగ్ కళాశాల ప్రతినిధులు డాక్టర్ పి కోదండరామారావు, డాక్టర్ పి.రవీంద్రబాబు, డాక్టర్ గుత్త ప్రసాద్, పట్టభద్రులు పాల్గొన్నారు.

# వల్లెపువారింట వైభవంగా స్వామివారి రాయబార మహోత్సవం





**గుడ్లవల్లేరు మేజర్ న్యూస్ :** గుడ్లవల్లేరులో వేంచేసియున్న శ్రీ రమా సహిత సత్యానారాయణ స్వామి దేవస్థానంలో స్వామి వారి 72వ బ్రహ్మోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. ఆదివారం రాత్రి 7 గంటలకు శ్రీస్వామివారి రాయబార మహోత్సవంను అశేష భక్తజన బృందం సమక్షంలో ఉభయ దాతలుగా వల్లెపు శ్రీనివాసరావు- వెంకటేశ్వరమ్మ దంపతులు, వల్లెపు వెంకటేశ్వరరావు-అనూష దంపతులు, వల్లెపు నాగేశ్వరరావు-వెంకట నాగమౌనిక దంపతులు వారి స్వగృహంలో జరిపించారు. రాయబార మహోత్సవాన్ని శతాధిక ప్రతిష్టాచార్య, యాజ్ఞీక బ్రహ్మ శ్రీమాన్ చలమచర్ల మురళీకృష్ణమాచార్యులు ఆద్యంతం వైభవోపేతంగా నిర్వహించారు. అనంతరం భక్తులకు స్వామి వారి ఆశీర్వచనాలు, తీర్థ ప్రసాదాలు అందచేశారు. నాల్గవరోజు సోమవారం ఉదయం 5 గంటలకు నిత్యోపాసన, బలిహరణ, విశేష అర్చనలతో వేదపండితులు స్వామి వారికి ప్రత్యేక పూజలు జరిపారు.

మధ్యాహ్నం 3 గంటలకు నీలిపూడి వాస్తవ్యులు పుప్పాల నాగేశ్వరరావు శ్రీ సీతారామకళ్యాణం శుభవచనం చెప్పారు. ఈ సందర్భంగా వందలాది భక్తజన బృందం పాల్గొన్నారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా బ్రహ్మోత్సవాల ఏర్పాట్లను దేవస్థన పాలకవర్గం చైర్మన్ కొప్పురావూరి రవీంద్ర, సభ్యులు మురాల నరేష్, భలే కల్పన, కోడే శారద, కాగితం హరికృష్ణ, చిలంకుర్తి వెంకటేశ్వరరావులు పర్యవేక్షించారు.

# గ్రాడ్యుయేట్ ఎన్నికల్లో గెలుపు మనదే..





**సీటు త్యాగం చేసిన ఆలపాటికి ఎమ్మెల్సీని బహుమతిగా ఇద్దాం**

**ఎమ్మెల్సీ ఎన్నికలపై పార్టీ నేతలతో సమావేశంలో మంత్రి కొల్లు రవీంద్ర**

**మచిలీపట్నం మేజర్ న్యూస్ :** సాధారణ ఎన్నికల సమయంలో అధినేత మాటకు గౌరవమిచ్చి సీటు త్యాగం చేసిన ఆలపాటి రాజేంద్రప్రసాద్ కి ఎమ్మెల్సీ సీటును బహుమతిగా ఇవ్వాల్సిన బాధ్యత ప్రతి కార్యకర్తపైనా ఉందని రాష్ట్ర గనులు, భూగర్భ వనరులు ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర అన్నారు.ఈ మేరకు మచిలీపట్నం తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో పార్టీ ముఖ్య నాయకులు, క్లస్టర్ ఇంఛార్జిలు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. మంత్రి మాట్లాడుతూ. సాధారణ ఎన్నికలకు ఓట్లు ఎక్కడున్నాయో స్పష్టంగా తెలుస్తాయి. కానీ గ్రాడ్యుయేట్ ఓట్లను మనమే వెతుక్కుంటూ వెళ్లాల్సిన అవసరం ఉంటుందన్నారు.గత ఎన్నికలకు ముందు జరిగిన గ్రాడ్యుయేట్ ఎన్నికల్లో మూడు సీట్లు మనం గెలుచుకున్నందునే,సాధారణ ఎన్నికలు మనకు సులువయ్యాయి. ఇంతటి భారీ విజయాన్ని అందించి పెట్టాయి.అదే విధంగా ఇప్పుడు జరిగే గ్రాడ్యుయేట్ ఎన్నికలను కూడా ప్రతిష్టాత్మకంగా తీసుకోవాలన్నారు. తద్వారా త్వరలో జరగబోయే స్థానిక సంస్థల ఎన్నికలు సులువుగా గెలుచుకునేందుకు అవకాశం ఉంటుందన్నారు. నియోజకవర్గంలో దాదాపు 10 వేల ఓట్లున్నాయి. వాటిని క్లస్టర్ ఇంఛార్జిలు, డివిజన్ ఇంఛార్జిలు ప్రతి ఓటరుని కూడా ప్రత్యక్షంగా కలిసి ఓటు వేయాల్సిందిగా చూసుకోవాల న్నారు. రాష్ట్ర అభివృద్ధి కోసం రేయింబవళ్లు శ్రమిస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకి అదే మనం ఇచ్చే గౌరవం అన్నారు.ఎన్నికల్లో గెలిచే వరకు ప్రతి కార్యకర్తా, నాయకుడు క్షేత్రస్థాయిలో పర్యటించాలని, మంత్రి కొల్లు రవీంద్ర పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు, మోటు మర్రి బాబా ప్రసాద్,గొర్రెపాటి గోపీచంద్, గోపు సత్యనారాయణ, కుంచె నాని, కాగిత వెంకటేశ్వరావు, తదితర నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## చిన్నారులకు స్వయంగా అల్బెండజోల్ మాత్రలు వేసిన కలక్టర్ డీకే బాలాజీ.



**మచిలీపట్నం మేజర్ న్యూస్ :** జాతీయ నులి పురుగుల దినోత్సవం సందర్భంగా స్థానిక పోర్ట్ రోడ్డులో ప్రభుత్వ రాంజీ ఉన్నత పాఠశాలలో జాతీయ నులి పురుగుల నిర్మూలన కార్యక్రమంలో పాల్గొని చిన్నారులకు స్వయంగా అల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేసిన జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ. జిల్లా వైద్యశాఖ అధికారిని డాక్టర్ శర్మిష్ఠ,

## విద్యా కేంద్రాల్లో నులిపురుగుల నివారణా దినోత్సవం



**గుడ్లవల్లేరు మేజర్ న్యూస్ :** జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం సందర్భంగా గుడ్లవల్లేరు శ్రీ సాయి విద్యానికేతన్ పాఠశాలలో 147 మంది బాలబాలికలకు గుడ్లవల్లేరు ఆరోగ్య కార్యకర్త రమా దేవి, ఆశ కార్యకర్తలు చందన, జ్యోతి, సిబ్బంది ఆల్బెండజోల్ బిళ్ళలు వేశారు. పాఠశాల కరస్పాండెంట్ సింగంశెట్టి ఆదినారాయణ, ఉపాధ్యాయులు రహీమున్నీసా, బేబిసరోజిని తదితరులు పాల్గొన్నారు. అలాగే గుడ్లవల్లేరులోని మండల పరిషత్ పాఠశాలలు, ఉన్నత పాఠశాలలు, కళాశాలలు, అంగన్వాడీ కేంద్రాలలో విద్యార్థులకు నులిపురుగుల నివారణా మాత్రలు వేశారు.

## రామకోటేశ్వరరావు కుటుంబానికి అండగా ఉంటాం



**ఘంటసాల, మేజర్ న్యూస్ :** మండల పరిధిలోని శ్రీకాకుళం శివారులోని సూర్పనేనిపాలెంలో ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్ర గాయాలైన తోడేటి రామకోటేశ్వరరావు కుటుంబానికి అండగా ఉంటామని ప్రముఖ పారిశ్రామికవేత్త కూటమి నాయకులు విక్కుర్తి వెంకట శ్రీనివాసరావు అన్నారు. ఆయన మాట్లాడుతూ కోటేశ్వరరావు త్వరగా కోలుకోవాలని ఆయన ఆకాంక్షించారు. ఆయన త్వరగా కోలుకోవాలని, చికిత్స నిమిత్తం కొంత ఆర్థిక సహాయం అందించారు. విక్కుర్తి రాంబాబు, పులిగడ్డ చంద్ర, బర్మా శ్రీనివాసరావు, బొప్పన పవన్, పోతన ఆంజనేయులు, పోతన కాకులేశ్వరరావు, అంబటి నాగరాజు, కొండవీటి ఏడుకొండలు, కొల్లిపర పద్మాకర్, పోతనరవి, తిరుమలశెట్టి బోసు, బత్తుల గణేష్, తోడేటి సురేష్ పాల్గొన్నారు.

## గోల్డ్ మెడల్ సాధించిన నాగిడి గాయత్రీని అభినందించిన జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ



**మచిలీపట్నం మేజర్ న్యూస్ :** సోమవారం కలెక్టరేట్ చాంబర్లో బంగారు పతక విజేత గాయత్రిని జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ, జాయింట్ కలెక్టర్ గీతాంజలి శర్మ ఘనంగా సత్కరించారు. రాష్ట్రానికి, జిల్లాకు గ్రామానికి పేరు తెచ్చిన గాయత్రిని శాలువాతో సత్కరించి అభినందించారు. ఉత్తరాఖండ్ రాష్ట్రంలో జనవరి 28 నుంచి ఈనెల 14 వరకు జరుగుతున్న 38 వ జాతీయ స్థాయి క్రీడలలో జిల్లాకు చెందిన నాగాయలంక గ్రామ వాసి నాగిడి గాయత్రి స్విమ్మింగ్ మహిళల విభాగంలో అసమాన ప్రతిభను ప్రదర్శించి బంగారు పతకం సాధించడం పట్ల కలెక్టర్ డీకే బాలాజీ అభినందించారు. అంతే కాకుండా అంతర్జాతీయ స్థాయిలో పతకాలు సాదించగల నైపుణ్యం ఉందని కొనియాడినారు. గాయత్రి కుటుంబ సభ్యులు జలక్రీడల పై ఉన్న ఆసక్తిని, మక్కువను అభినందించి పూర్తి సహకారం అందిస్తామని కలెక్టర్ డీకే బాలాజీ అన్నారు.కార్యక్రమంలో జిల్లా క్రీడాభివృద్ధి అధికారి కే ఝాన్సీ లక్ష్మీ ఉన్నారు.

## శ్రీ కోదండరామస్వామి దేవస్థానంకు పరుచూరి జయ సాయి గోపికృష్ణ విరాళం



**హనుమాన్ జంక్షన్, ఫిబ్రవరి 10, మేజర్ న్యూస్ :** బాపులపాడు మండలం రంగయ్య అప్పారావుపేట గ్రామంలో వేంచేసి ఉన్న శ్రీ కోదండ రామస్వామి దేవస్థానంలో అభివృద్ధి పనులకు అన్నయ్య అప్పారావుపేట గ్రామానికి చెందిన పరుచూరి ప్రసాద్, నందిని దంపతులు ఏకైక పుత్రుడు పరుచూరి జయ సాయి గోపికృష్ణ రూ.1,00,116లు, పరుచూరి శ్రీహరి రూ.5000లు, పరుచూరి ధన కోటేశ్వరరావు రూ.5000లు, పరుచూరి రామకృష్ణ రూ.5007లు, ఈడ్పుగంటి రవి కిరణ్ రూ.1116లు, వల్లభనేని తిరుమ లరావు రూ.5000లు, మేడికొండ వెంకటకృష్ణారావు రూ.7116లు, బొందలపాటి వెంకట కృష్ణారావు రూ.5000లు, తుమ్మల జనార్దన్ రావు రూ.5000లు, పరుచూరి బుజ్జిబాబు రూ.1000లు, సోమయజులు శాస్త్రి రూ.5000, సుగసాని ప్రభాకర్ రావు రూ.10000లు, మున్నంగి శేషగిరిరావు 40 టన్నుల ఇసుక, లింగం పిచ్చేశ్వ రరావు 30టన్నుల కంకర, దొడ్డపనేని రాధాకృష్ణ రూ.10వేలు లారీ కిరాయి, దేవాలయం అభివృద్ధికి విరాళాలు అందజేసినట్లు శ్రీ కోదండ రామస్వామి ఆలయ అభివృద్ధి కమిటీ కోశాధికారి పరుచూరి సుకన్య తెలియజేశారు. ఈ సందర్భంగా పరుచూరి సుకన్య మాట్లాడుతూ చిన్న వయసులో ఆధ్యాత్మిక సేవా కార్యక్రమాలకు లక్షల రూపాయలు విరాళం అందజేస్తున్న పరుచూరి జయ సాయి గోపికృష్ణ కు, ఆలయ అభివృద్ధి పనులకు నిధుల సేకరణకు తమ వంతు సహకారాన్ని అందిస్తున్న పరుచూరి ధన కోటేశ్వర రావు, పరుచూరి ప్రసాద్‌లకు ఆమె అభినందనలు తెలియజేశారు. శ్రీరామనవమికి ఆలయం మరమ్మతులు పూర్తి చేస్తామని సుకన్య తెలియజేశారు.

## రోడ్డు ప్రమాదంలో వ్యక్తి దుర్మరణం





**పామర్రు ఫిబ్రవరి 10 మేజర్ న్యూస్ :** రోడ్డు ప్రమాదంలో ఒక వ్యక్తి తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతి చెందిన మండల కేంద్రమైన పామర్రు సమీపంలో చోటు చేసుకుంది. ఈ సంఘటనకు సంబంధించి సేకరించి వరాల ప్రకారం పామర్రుకు చెందిన తాడిశెట్టి సుబ్రహ్మణ్యం (65) బ్యాంకుకు వెళ్లి తిరిగి సైకిల్ పై ఇంటికి వెళుతుండగా గుడివాడ రోడ్ లో కొండిపర్రు రోడ్డు ఆర్చి సమీపంలో ఏపీ 37 యుయు 7495 నెంబర్ గల ఆటో అతివేగంగా వచ్చి వెనుక నుండి ఢీకొంది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన సుబ్రహ్మణ్యం అక్కడికక్కడే మృతిచెందాడు. సమాచారం అందిన వెంటనే పామర్రు పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్ట్ మార్టం నిమిత్తం గుడివాడ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఆటో డ్రైవర్ ను అదుపులోకి తీసుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై చెప్పారు.

## అన్వేష్ కుటుంబాన్ని పరామర్శ



**ఏ.కొండూరు, మేజర్ న్యూస్:** మండలంలోని పోలిశెట్టిపాడు గ్రామానికి చెందిన ఎం.అన్వేష్ కుటుంబాన్ని సోమవారం వైఎస్ఆర్సిపి దివ్యాంగుల విభాగం రాష్ట్ర అధ్యక్షులు కిరణ్ రాజు వైఎస్ఆర్సిపి తిరువూరు నియోజకవర్గ ఇన్చార్జ్ నల్లగట్ల స్వామి దాస్ పరామర్శించారు. ఇటీవల జరిగిన ప్రమాదంలో తీవ్ర గాయాలైన మానసిక దివ్యాంగుడు ఎం అన్వేష్ కుటుంబాన్ని పరామర్శించి ధైర్యం చెప్పారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వంలో బలహీన దివ్యాంగులకు అన్యాయం జరుగుతుందన్నారు. ఈనెల 6తేదీన సదరం సర్టిఫికెట్ కోసం విజయవాడ వెళ్లి వస్తున్న క్రమంలో మైలవరం గ్రామ సమీపంలో ఆటో ప్రమాదానికి గురైంది అన్నారు. ఈ ప్రమాదంలో ఒక దివ్యంగుడు మృతి చెందడంతో పాటు అన్వేష్ తల్లిదండ్రులకు తీవ్ర గాయాలయ్యాయి అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే బాధిత కుటుంబాన్ని ఆదుకోవాలని అన్నారు. ఈ కుటుంబ పరిస్థితిని మాజీ సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి దృష్టికి తీసుకెళ్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైఎస్ఆర్సిపి నాయకులు నరేడ్ల వీరారెడ్డి పాల్గొన్నారు.

# టిడ్కో కాలనీలో సమస్యలు పరిష్కరించాలి



### బీజేపీ పట్టణాధ్యక్షుడు ఆర్ కే

**గుడివాడ, మేజర్ న్యూస్ :** పట్టణలోని టిడ్కో కాలనీలో రోజు రోజుకు పెరిగిపోతున్న సమస్యల పరిష్కరానికి బిజెపి అధ్వర్యంలో స్వంచ్ఛ భారత్ కార్యక్రమాన్ని నిర్వహించి కాలనీలోని చెత్తను తొలగించినట్లు బిజెపి పట్టణధ్యక్షుడు మాచర్ల రామకృష్ణ (ఆర్.కె) తెలిపారు. సోమవారం స్థానిక టిడ్కో కాలనీలో ప్రజా సమస్యలు తెలుసుకుని స్వచ్ఛభారత్ కార్యక్రమం చేసి ఆ సమస్యలను మున్సిపల్ కమిషనరికి వినతి పత్రం అందజేయడం జరిగిందని బిజెపి పట్టణాధ్యక్షుడు ఆర్కె తెలిపారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ గత కొన్ని రోజులుగా టిడ్కో కాలనీలో చెత్తాచెదారం పోరిగిపోయి డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగ తయారైందన్నారు. దీని వల్ల ఈ ప్రాంతంలో దోమలతో, దుర్వాసనతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతునట్లు తెలిపారు. పందులు సంచారం విపరితంగా పెరిగిపోయిందన్నారు. స్థానిక ఎమ్మెల్యే వెనిగండ్ల రాము రోజు పట్టణంలో ఉన్న సమస్యలు తెలుసుకుని పరిష్కరించాలని మునిసిపల్ అధికారులకు అదేశాలు జరిచేసిన పట్టించుకోవడం లేదన్నారు. ముఖ్యంగా చెత్తను వేయడానికి ప్రతి ఇంటికి దస్టు బిన్నులు ఇవాలన్నారు. ఈ ప్రాతంలో ఆరోగ్య పరిరక్షణకు ప్రతేకంగా క్యాంపులు నిర్వహించి ప్రజలను అనారోగ్యల బారిన పడకుండ కాపాలని కోరారు. ఈ కార్యక్రమంలో బిజెపి మోర్చా నాయకురాలు బోనం గోపిక, ఎస్సీ మోర్చా నాయకులు దేవరపల్లి చిన్న, నాయకులు లంక రాంబాబు, రిట, చరణ్, రాజు, టిడ్కో కాలనీ ప్రజలు పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదానికి గురైన వ్యక్తి చికిత్స పొందుతూ మృతి



### మృతి చెందిన వ్యక్తి అవయవాలు పలువురికి ప్రాణదానం

**బంటుమిల్లి మేజర్ న్యూస్:** ఇటీవల రోడ్డు ప్రమాదానికి గురైన వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందారు. తను చనిపోతూ కూడా పలువురికి ప్రాణదానం చేసిన బుద్ధన కోటేశ్వరరావు (55) నేటి సమాజానికి ఆదర్శంగా నిలిచారు. కుటుంబ సభ్యులు ఇచ్చిన సమాచారం మేరకు కృష్ణాజిల్లా కృత్తివెన్ను మండలం నీలిపూడి గ్రామానికి చెందిన బుద్ధన కోటేశ్వరరావు ( 55) ఈనెల 5వ తేదీన బంటుమిల్లి ఎంపీడీవో కార్యాలయం సమీపంలో రోడ్డు ప్రమాదానికి గురయ్యారు. దీంతో విజయవాడలోని ఒక ప్రైవేట్ ఆస్పత్రిలో ఆయన చికిత్స పొందుతున్నారు. కాగా ఆదివారం రాత్రి కోటేశ్వరరావు కు బ్రెయిన్ డెడ్ కు గురయ్యారు. అయితే ఆయన కోరిక మేరకు కుటుంబ సభ్యులు అవయవ దానం చేసేందుకు ముందుకు వచ్చారు. ఈ మేరకు బుద్ధన కోటేశ్వరరావు కు సంబంధించిన హార్ట్, కిడ్నీ, లివర్‌లను సోమవారం విజయవాడలో ప్రాణదానం చేయనున్నారు. ఇలా తను చనిపోతూ కూడా మరి కొంతమందికి అవయవ దానం చేసి ప్రాణాలను నిలబెడుతున్న బుద్ధన కోటేశ్వరరావు నేటి సమాజానికి ఆదర్శప్రాయంగా నిలిచారు. ఆయన మృతి పట్ల నీలిపూడీ గ్రామం శోకసంద్రం అయింది. అలాగే బంటుమిల్లి కృత్తివెన్ను మండలాలలో పలువురు కోటేశ్వర రావు మృతి పట్ల సంతాపం తెలియజేస్తున్నారు. ఆయన మృదేహాన్ని బంటుమిల్లిలో తన నివాసం వద్ద సందర్శనార్థం ఉంచారు.

## అక్కినేని కుటుంబ సభ్యులను పరామర్శించిన ఎమ్మెల్యే



**పామర్రు ఫిబ్రవరి 10 మేజర్ న్యూస్:** పమిడిముక్కల మండలం అగినపర్రు గ్రామంలో సోమవారం జరిగిన అక్కినేని భువనేశ్వరరావు తల్లి పెద్దకర్మ కార్యక్రమంలో పామర్రు శాసనసభ్యులు వర్ల కుమార్ రాజా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే తో పాటు తెలుగుదేశం పార్టీ నాయకులు నాదెళ్ళ సుబ్రహ్మణ్యం, ఘంటా సురేష్ తదితరులు పాల్గొన్నారు.

## వాటర్ సర్వీసింగ్ పాయింట్‌లో ప్రమాదం యువకుడు మృతి



**బంటుమిల్లి మేజర్ న్యూస్:** వాటర్ సర్వీసింగ్ పాయింట్ ప్రమాదంలో యువకుడు మృతి చెందిన సంఘటన బంటుమిల్లి మండలం జానకిరాంపురం గ్రామంలో సోమవారం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం వాటర్ సర్వసింగ్ పాయింట్ లో బంటుమిల్లి మండలం సాతులూరు గ్రామానికి చెందిన నరేష్ ఆటోకు సర్వీసింగ్ చేస్తుండగా కాలుజారి సప్తలో పడటంతో తలకు బలమైన గాయాలు తగిలింది. దీంతో సమీపంలో ఉన్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించే లోపే మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. సమీప బంధువులు ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. అనుమానాస్పద కేసుగా నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు వెల్లడించారు.

## మొక్కజొన్న పొలాన్ని పరిశీలించిన వ్యవసాయ శాఖ అధికారులు



**చల్లపల్లి, మేజర్ న్యూస్:** మొక్కజొన్న విత్తనాలు మొలకెత్తని వైనంపై వ్యవసాయశాఖ అధికారులు సోమవారం సంబంధిత పొలాన్ని పరిశీలించారు. నడకుదురు గ్రామంలో రైతు, సర్పంచ్ గొరిపర్తి సురేష్ సాగుచేస్తున్న రెండున్నర ఎకరాల పొలాన్ని వ్యవసాయశాఖ ఏడీఏ ఎస్. శ్యామల, ఏవో జి.సాయిసింధులు సందర్శించారు. మొక్కజొన్న విత్తనాలు ఏమేరకు మొలకెత్తాయో పరిశీలించి, రైతు నుంచీ వివరాలు సేకరించారు. మొలకెత్తని విత్తనాల కారణంగా నష్టపోయిన రైతుకు తగు న్యాయం చేసేందుకు కృషిచేయనున్నట్లు అధికారులు తెలిపారు. క్షేత్ర పరిశీలన, రైతు ఫిర్యాదులపై తమ నివేదికను ఉన్నతాధికారులకు పంపుతామని చెప్పారు.

## ఘనంగా జాతీయ నులిపురుగుల దినోత్సవం



**ఘంటసాల, మేజర్ న్యూస్:** జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం సందర్భంగా మండల పరిధిలోని ఘంటసాల పాలెం గ్రామంలోని అంగన్వాడీలు, పాఠశాలల్లో చిన్నారులకు, విద్యార్థులకు నులి పురుగుల నివారణకు ఆల్బెండాజోల్ మాత్రలు సోమవారం పంపిణీ చేశారు. పరిశుభ్రత గురించి విద్యార్థులకు అవగాహనా కల్పించారు. ఘంటసాలపాలెం పిహెచ్సి డా. నిఖిత ప్రసాద్, ఎం. పి. హెచ్‌ఓ. పిబి భాస్కర్, ఏ. ఎన్ఎం. జి. సునీత, ఎం. పీ. హెచ్ఏ. సి. హెచ్. శ్రీనివాసరావు, హెచ్ఎం. లు ఆర్. రాజశేఖర్, కె. సాల్మన్ రాజు, ఆశా కార్యకర్తలు జీ. వి. కమల కుమారి, వై. సునీత, కె. రాణి, అంగన్వాడీ టీచర్లు ఎన్. మానస, కె. కనకదుర్గ, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

## చల్లపల్లిలో ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న టీడీపీ నేతలు



**చల్లపల్లి, మేజర్ న్యూస్ :** కృష్ణా.. గుంటూరు జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి ఆలపాటి రాజేంద్రప్రసాద్(రాజా)ను అఖండ మెజారిటీతో గెలిపించాలని కూటమి నేతలు విజ్ఞప్తి చేశారు. శాసనమండలి ఎన్నికల సందర్భంగా సోమవారం చల్లపల్లిలో టీడీపీ, జనసేన నేతలు పట్టభద్రుల ఇళ్లకు వెళ్లి ప్రచారం చేపట్టారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో పట్టభద్రులు ప్రతి ఒక్కరూ మొదటి ప్రాధాన్యత ఓటు ఆలపాటి రాజాకు వేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో తెలుగుయువత జిల్లా ఉపాధ్యక్షుడు మోర్ల శివ, ఎంపీటీసీ పైడిపాముల స్వప్న, షేక్ నబీఘోరీ, ఆసుపత్రి అభివృద్ధి కమిటీ డైరెక్టర్ తోట కనకదుర్గ, బావిశెట్టి కనకదుర్గ, గంగాధరరావు తదితరులున్నారు.

# ప్రాణం నిలబెట్టే ఆసుపత్రులే నిజమైన దేవాలయాలు

### ప్రభుత్వ విప్ తంగిరాల సౌమ్య





**కంచికచర్ల ఫిబ్రవరి 10 మేజర్ న్యూస్ :** ప్రాణం నిలబెట్టే ఆసుపత్రులు నిజమైన దేవాలయాలుని ప్రభుత్వ విప్ నందిగామ ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య పేర్కొన్నారు. కంచికచర్ల పట్టణంలో నూతనంగా ఏర్పాటు చేసిన అద్విత స్పెషాలిటీ హాస్పిటల్ ప్రారంభోత్సవ కార్యక్రమానికి సోమవారం ముఖ్య అతిథిగా హాజరయ్యారు. రిబ్బన్ కట్ చేసి ఆసుపత్రి ప్రారంభోత్సవంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆసుపత్రి యాజమాన్యానికి ప్రత్యేకంగా శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ క్రమంలో మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వం ప్రైవేటు ఆసుపత్రులకు ఆరోగ్యశ్రీ బిల్లులు చెల్లించకపోవడంతో పేదలకు వైద్య సేవలు అందలేదని విమర్శించారు. టీడీపీ కూటమి ప్రభుత్వం అందరికీ అండగా ఉంటుందని, టిడిపి కూటమి పాలనలో ఆరోగ్యశ్రీకి మహర్ద వచ్చిందని అన్నారు. ప్రజా సేవలో సాగుతున్న ప్రైవేటు వైద్య సంస్థలకు ఈ ప్రభుత్వం మద్దతు ఇస్తుందన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు ఆధునిక ఆలోచనలతో వైద్య రంగంలో ప్రాముఖ్యత కలిగిన ఆరోగ్యశ్రీని ముందంజలో ఉంచుతామన్నారు. అద్విత హాస్పిటల్ ఏర్పాటు చేసి 24 గంటలు సేవలందించాలనే ఆలోచన అభినందనీయమని హాస్పిటల్ ప్రతినిధులు డాక్టర్ కొత్త అశోక్ నాయుడు, డాక్టర్ ఇక్కుర్తి శివ ప్రీతి, సిబ్బందిని ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు కోగంటి బాబు, కూటమి నేతలు పాల్గొన్నారు.

# కూటమి ఎమ్మెల్సీ అభ్యర్థి ఆలపాటిని గెలిపిద్దాం...




**కంచికచర్ల ఫిబ్రవరి 10 మేజర్ న్యూస్ :** ఉమ్మడి కృష్ణ గుంటూరు జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ కూటమి అభ్యర్థిగా పోటీ చేయుచున్నఆలపాటి రాజేంద్ర ప్రసాద్‌ను అత్యధిక మెజారిటీతో గెలిపించాలని రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ గుడివాడ మాజీ ఎమ్మెల్యే రావి వెంకటేశ్వరరావు పేర్కొన్నారు. ఈనెల 27న జరగబోయే పట్టా భద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలను పురస్కరించుకొని కంచికచర్ల పట్టణ పరిధిలో గల జిల్లా పరిషత్ హై స్కూల్, అక్షర డిగ్రీ కాలేజ్, ఎన్టీఆర్ జూనియర్ కాలేజ్, ఏకత్వ స్కూల్స్ లను మండల టిడిపి పార్టీ అధ్యక్షులు కోగంటి బాబు తో కలిసి రావి సోమవారం సందర్శించారు. అధ్యాపకులతో సమావేశం నిర్వహించి ఎన్డీఏ కూటమి అభ్యర్థిగా కృష్ణ గుంటూరు పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థిగా పోటీ చేయుచున్న ఆలపాటి రాజేంద్రప్రసాద్ కి తమ ఓట్లు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించి తమ వంతు సహాయ సహకారాలు అందించాలని అధ్యాపకులను ఆయన కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యారంగానికి రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ఎంతగానో ప్రాధాన్యత ఇస్తున్నారన్నారు. అదే విధంగా విద్యారంగం పటిష్టతగా ఉండాలి అంటే మనం ఆలపాటి రాజేంద్రప్రసాద్‌ని గెలిపించుకోవాలని అన్నారు. సకల జనుల శ్రేయసే ఎన్డీఏ కూటమి ధ్యేయం అన్నారు. ఈ కార్యక్రమంలో మండల టిడిపి పార్టీ అధ్యక్షులు కోగంటి బాబు సీనియర్ పార్టీ నాయకులు గుత్తరత్నం, టౌన్ పార్టీ అధ్యక్షులు వేమా వెంకట్రావు, పుల్లగూర బాబు,బుడ్డి సూర్య ప్రకాష్,మాజీ ఎంపీటీసీ సభ్యులు రొంపిచర్లశ్యామ,వాసు బత్రె,షేక్ మస్తాన్,పఠాన్ బాజీ ఖాన్,వేల్పుల శివ,ఏకత్వ స్కూలు డైరెక్టర్ అమర నేనీ సింధూర,ప్రిన్సిపాల్ సూర్యవతి, అక్షర కాలేజ్ కరస్పాండెంట్ కాసరగడ్డ రామారావు, జిల్లా పరిషత్ హై స్కూల్ ఎన్టీఆర్ కాలేజ్ అధ్యాపకులు పాల్గొన్నారు.

# నులి పురుగులు.. మానసిక వికాసానికి నిరోధకాలు



**ఎన్టీఆర్ జిల్లా బ్యూరో, ఫిబ్రవరి 10, మేజర్ న్యూస్ :** నులి పురుగులు పిల్లలు, కిశోర బాలల్లో రక్తహీనత, పోషకాల లోపాలకు కారణమవుతాయని.. అందుకే అందరూ అల్బెండజోల్ మాత్రను తీసుకోవాలని జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ అన్నారు. సోమవారం నగరంలోని గవర్నర్‌పేట చుండూరు వెంకటరెడ్డి నగరపాలక సంస్థ ఉన్నత పాఠశాలలో జరిగిన జాతీయ నులి పురుగుల నిర్మూలన కార్యక్రమంలో కలెక్టర్ లక్ష్మీశ పాల్గొన్నారు. అధికారులతో కలిసి చిన్నారులకు స్వయంగా అల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ నులి పురుగులు వల్ల వివిధ శారీరక సమస్యలతో పాటు మానసిక ఆరోగ్యం పరంగా కూడా సమస్యలు వస్తాయని, ఇది చదువుపై ప్రభావం చూపుతుందని పేర్కొన్నారు. అల్బెండజోల్ మాత్రలు తీసుకోవడం ద్వారా ఈ సమస్యల బారినపడకుండా చూసుకోవచ్చన్నారు. సోమవారం 1-19 ఏళ్ల వయసు వారందరికీ అల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేశామని.. ఇంకా ఎవరైనా వివిధ కారణాల వల్ల మాత్ర తీసుకోకుండా ఉండిపోతే వారికి ఈ నెల 17న మాత్రలు ఇవ్వడం జరుగుతుందన్నారు. నులిపురుగుల నిర్మూలనతో పిల్లలకు ఆరోగ్య పరంగా బహుళ ప్రయోజనాలు ఉన్నాయన్నారు. నులి పురుగుల నిర్మూలన ద్వారా రక్తహీనత రాకుండా ఆరోగ్యకర జీవనానికి అవకాశం ఏర్పడుతుందని పేర్కొన్నారు. నులిపురుగుల సంక్రమణాన్ని తగ్గించేందుకు డీవార్మింగ్‌కు అదనంగా పాటించాల్సిన విషయాలను కూడా వివరించారు. శుభ్రమైన నీటిని తాగడం, చేతులను ఎప్పుడూ శుభ్రంగా ఉంచుకోవడం వంటివాటిని కలెక్టర్ లక్ష్మీశ తెలియజెప్పారు. డీఎంహెచ్‌వో డా. ఎం.సుహాసిని మాట్లాడుతూ ఏడాదికి రెండుసార్లు పిల్లలు, కిశోర బాలలకు అల్బెండజోల్ మాత్రలను పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. ఈ మాత్రల ప్రయోజనాలు ఏమిటనే విషయాన్ని వివరించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, అంగన్‌వాడీ కేంద్రాలు, విద్యాసంస్థల్లో గోడపత్రికల ద్వారా నులి పురుగుల నిర్మూలన కార్యక్రమంపై అవగాహన కల్పించి.. పాఠశాలలు, జూనియర్ కళాశాలలు, ఐటీఐ, పాలిటెక్నిక్, నర్సింగ్ తదితర విద్యార్థులకు నులి పురుగుల మాత్రలను ఉచితంగా పంపిణీ చేయడం జరిగిందని వివరించారు. ఇన్‌లాండ్ వాటర్ వేస్ అథారిటీ ఆఫ్ ఇండియా విజయవాడ డివిజన్ ఆధ్వర్యంలో జల రవాణాపై విద్యార్థులకు నిర్వహించిన వ్యాస రచన పోటీల్లో విజేతలకు కలెక్టర్ లక్ష్మీశ.. అథారిటీ డైరెక్టర్ అజిత్‌సింగ్‌తో కలిపి కార్యక్రమం అనంతరం బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో డీఈవో యూవీ సుబ్బారావు, ఐసీడీఎస్ పీడీ డి.శ్రీలక్ష్మి, జిల్లా రాష్ట్రీయ బాల స్వాస్థ్య కార్యక్రమం అధికారి, ప్రోగ్రామ్ ఇన్‌ఛార్జ్ డా. మాధవి, పాఠశాల ప్రధానోపాధ్యాయులు సీహెచ్ సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

# వాటర్ సర్వీసింగ్ పాయింట్‌లో ప్రమాదం

### యువకుడు మృతి



**బంటుమిల్లి మేజర్ న్యూస్:** వాటర్ సర్వీసింగ్ పాయింట్ ప్రమాదంలో యువకుడు మృతి చెందిన సంఘటన బంటుమిల్లి మండలం జానకిరాంపురం గ్రామంలో సోమవారం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం వాటర్ సర్వసింగ్ పాయింట్‌లో బంటుమిల్లి మండలం సాతులూరు గ్రామానికి చెందిన పోతన నరేష్ (35) తన టాటా మ్యాజిక్ ను జానకిరాంపురం శ్రీ విజయ కనకదుర్గ సర్వీసింగ్ పాయింట్‌లో వాటర్ తో అడుగుతుండగా ర్యాంపుపై ప్రమాదవశాత్తు కాలుజారి పడటంతో తలకు బలమైన గాయాలు తగిలింది. దీంతో సమీపంలో ఉన్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించే లోపే మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. సమీప బంధువులు ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. అనుమానాస్పద కేసుగా నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై గణేష్ కుమార్ వెల్లడించారు.

## చోరీ కేసులో ముద్దాయి అరెస్ట్: ఎస్ఐ శ్రీనివాస్



**నందివాడ, మేజర్ న్యూస్:** ఎట్టకేలకు చోరీ కేసులు ముద్దాయిని నందివాడ పోలీసులు అరెస్ట్ చేశారు. వివరాల్లోకెళితే పుట్టగుంట గ్రామంలో ఉరిచివరన బడ్డీ కొట్టు నడుపుకొంటున్న వృద్ధ దంపతులు అయిన పిల్లి జయలక్ష్మీ ఆమె భర్త ధర్మారావు లను ది 18.07.2023 వ తేదీన తెల్లవారుజామున ఎవరో గుర్తుతెలియని వ్యక్తులు కత్రలతో బెదిరించి వారి వద్ద నుండి 20,000/-నగదు, సూత్రాలు గల బంగారు నానుత్రాడు ఎత్తుకుపోయారు. అప్పటి నుండి నందివాడ పోలీస్ స్టేషన్ ఎస్ఐ శ్రీనివాస్ టెక్నాలజీ ని ఉపయోగించి ముద్దాయి అయిన బచ్చు సతీష్, తండ్రి: బాలచంద్రుడు, వయస్సు: 49 సంవత్సరాలు, కులం: కాపు, రామచంద్రాపురం గ్రామం, అవనిగడ్డ మండలం, ని ఉదయం 09.00 గంటలకి జొన్నపాడు సెంటర్ వద్ద అరెస్ట్ చేసి ముద్దాయి వద్ద నుండి 27 గ్రాముల 550 మిల్లీ గ్రాములు గల సూత్రాలు గల బంగారు నానుత్రాడు ని రికవరీ చేసి గుడివాడ కోర్టులో హాజరుపర్చగా అతనికి 14 రోజుల రిమాండ్ విధించారని ఎస్ఐ శ్రీనివాస్ తెలిపారు.

## విద్యుత్ శాఖ ఆధ్వర్యంలో విజిలెన్స్ దాడులు

### సుమారు ఎనిమిది లక్షల జరిమానా



**కంచికచర్ల ఫిబ్రవరి 10 మేజర్ న్యూస్ :** మండలంలో విద్యుత్ వినియోగదారుల గృహాలు,వాణిజ్య సముదాయాల పై విద్యుత్ శాఖ విజిలెన్సు అధికారులు సోమవారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు.ఈ తనికి లో విజిలెన్స్ ఎస్ ఈ.బి. విజయ కృష్ణ,ఈఈ విజయ కుమారి ఆధ్వర్యంలో అధికారులు 42 బృందాలుగా ఏర్పడి2542 గృహ సర్వీసులు, 450 వాణిజ్య సముదాయాలు తనిఖీ చేసినారు. వాటిలో 324 సర్వీసు లకు అదనపులోడు 414 కిలో వాట్స్ పెంచటం ద్వారా మొత్తానికి 8,28,000/- అపరాధ రుసుము విధించారు. విద్యుత్ చౌర్యం సామాజిక నేరమని, విద్యుత్ చౌర్యం చేసిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఎక్కడైనా విద్యుత్ చౌర్యం జరిగినట్లయితే ఈ నెంబర్లకు 9440812362, 9440812363, 8331014951 సమాచారం ఇవ్వాల్సిందిగా కోరారు. ఈ విద్యుత్ విజిలెన్స్ తనిఖీలలో విజయవాడ రూరల్ ఈఈ ఎం.వసంతరావు, ఇబ్రహీంపట్నం డిఈఈ కె.వై.కొండలరావు, కంచికచర్ల ఏఈ బి.దిబ్బయ్య, విజయవాడ రూరల్ డివిజన్ పరిధిలోని డిఈఈలు, ఏఈలు, జేఈలు, లైన్ ఇన్స్పెక్టర్లు, సిబ్బంది పాల్గొన్నారు.ఈ సందర్భంగా విద్యుత్ ప్రమాదాల నివారణా చర్యల మీద కొన్ని సూచనలు తెలియపరిచినారు,ఈ సూచనలు అన్నియు వినియోగదారులు ప్రతి ఒక్కరు విద్యుత్ ప్రమాదాలు అరికట్టాలని అధికారులు కోరారు.

## జాతీయ క్రీడల్లో స్వర్ణం సాధించిన గాయత్రిని సన్మానించిన ఎమ్మెల్యే మండలి



**అవనిగడ్డ, మేజర్ న్యూస్ :** ఉత్తరాఖండ్ రాష్ట్రంలో జరిగిన 38వ జాతీయ క్రీడల్లో స్వర్ణ పతకం సాధించిన నాగాయలంక బాలిక నాగిడి గాయత్రిని అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ ఘనంగా సత్కరించారు. సోమవారం సాయంత్రం అవనిగడ్డలోని గాంధీక్షేత్రంలో జాతీయస్థాయిలో కనోల్ స్లాలం (కే-1)లో స్వర్ణ పతకం సాధించిన సందర్భంగా ఆమెను అభినందించారు. గాయత్రిని, ఆమె సోదరుడిని ఎమ్మెల్యే బుద్ధప్రసాద్, నియోజకవర్గ యువనాయకులు మండలి వెంకట్రామ్ సత్కరించి రూ.15 వేలు ప్రోత్సాహక నగదు బహుమతి అందజేశారు. గాయత్రి తల్లిదండ్రులు నాగిడి నాగబాబు - వెంకట నాగేశ్వరమ్మ దంపతులను, మేనత్త లక్ష్మీ కుమారి - వెంకట్రావ్ దంపతులను అభినందించారు. టీడీపీ నియోజకవర్గ పరిశీలకులు కనపర్తి శ్రీనివాసరావు, ఎన్ఆర్ఐ బొబ్బా గోవర్ధన్ అభినందించారు

# ప్రగతికి ఓటు వేద్దాం...ప్రభుత్వంతో కలిసి నడుద్దాం...







## ఆలపాటి రాజాను అత్యధిక మెజార్టీతో గెలిపించుకోవాలి

### ఆలపాటి రాజాతో కలిసి తూర్పులో విస్తృత ప్రచారం

### నిర్వహించిన ఎమ్మెల్యే గద్దె రామమోహన్, గద్దె క్రాంతికుమార్

**విజయవాడ తూర్పు, మేజర్ న్యూస్ :** విద్యావంతుడు, సుధీర్ఘ రాజకీయ అనుభవంతో పాటుగా న్యాయవాదిగా, ఎమ్మెల్యేగా అనుభవంతో పాటుగా విద్యార్థి దశలోనే నాయకత్వ లక్షణాలు పెంపోందించుకున్న మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్‌ను ఎమ్మెల్సీగా అత్యధిక మెజార్టీతో గెలిపించుకోవాలని తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యే గద్దె రామమోహన్ చెప్పారు. సోమవారం ఉదయం తూర్పు నియోజకవర్గ పరిధిలోని సిద్ధార్థ పబ్లిక్ స్కూల్ ఆర్ట్స్ కాలేజీ, ఎన్ఎస్ఎం స్కూల్, ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ఆవరణలోని మైదానంలో ప్రచారం జరిగింది. మైదానంలో ఉన్న వాకర్స్‌ను కలసి ఈ నెల 27వ తేది జరుగుతున్న ఎమ్మెల్సీ ఎన్నికల్లో టీడీపీ, బీజేపీ, జనసేన పార్టీలు బలపరిచిన ఉమ్మడి కృష్ణాజిల్లా, గుంటూరు జిల్లాల పట్టభద్రుల నియోజకవర్గ అభ్యర్థి ఆలపాటి రాజేంద్రప్రసాద్‌కు మొదటి ప్రాధాన్యతా ఓటును వేయాల్సిందిగా ఆలపాటి రాజేంద్రప్రసాద్‌తో కలిసి ఎమ్మెల్యే గద్దె రామమోహన్, గద్దె క్రాంతికుమార్ ప్రచారం చేశారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే గద్దె రామమోహన్ మాట్లాడుతూ ఆలపాటి రాజేంద్రప్రసాద్ విద్యార్థి దశలోనే విద్యార్థి సంఘం నాయకుడిగా మంచి గుర్తింపు తెచ్చుకున్నారని అన్నారు. అన్న నందమూరి తారక రామారావు పార్టీ స్థాపించిన వెంటనే టీడీపీలో చేరారని, ఎమ్మెల్యేగా, మంత్రిగా పనిచేసిన ఆలపాటి రాజేంద్రప్రసాద్‌కు సుదీర్ఘ రాజకీయ అనుభవం ఉందన్నారు. న్యాయవాది కూడా కావడంతో ఏదైనా అంశంపై పూర్తి స్థాయి అవగాహనతో మాట్లాడటం ఆలపాటి రాజా సొంతమని చెప్పారు. శాసన సభలో ఏదైనా అంశం గురించి ఆలపాటి రాజా మాట్లాడితే అందరూ ఆ విషయాన్ని అంగీకరించే విధంగా ఉండేదన్నారు. అంతటి రాజకీయ అనుభవం ఉన్న ఆలపాటి రాజాను ఎమ్మెల్సీగా మొదటి ప్రాధాన్యతా ఓటు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాల్సిందిగా ఆయన కోరారు. ఎమ్మెల్సీ అభ్యర్థి ఆలపాటి రాజా మాట్లాడుతూ ఉమ్మడి కృష్ణాజిల్లా, గుంటూరు జిల్లాల పట్టభద్రుల నియోజకవర్గ కూటమి పార్టీలు బలపరిచిన అభ్యర్థిగా పోటి చేస్తున్న తనకు మొదటి ప్రాధాన్యతా ఓటును వేసి గెలిపించాల్సిందిగా కోరారు. ప్రగతికి ఓటు వేసి ప్రభుత్వంతో కలిసి నడుద్దామని పట్టభద్రుల, స్థానికుల సహకారం కోసం తాను ప్రచారం చేస్తున్నానన్నారు. సమాజాన్ని ముందుకు తీసుకు వెళ్ళాలనేదే ప్రభుత్వ ఆలోచన, సంకల్పమని అన్నారు. అక్షరమాలలోనే కాకుండా అభివృద్ధిలో కూడా రాష్ట్రాన్ని ముందుకు తీసుకువెళాతామన్నారు. ఎన్నికల్లో ప్రత్యర్థులు ఎవరైనా ప్రగతికి ఓటు వేసి మద్దతు ఇవ్వాలన్నారు. వైఎస్సార్‌సీపీ ఐదు సంవత్సరాల పాలనలో సమాజాన్ని సర్వనాశనం చేశారని అన్నారు. ఈ కార్యక్రమంలో కార్పోరేటర్లు జాస్తి సాంబశివరావు చెన్నుపాటి ఉషారాణి, చెన్నుపాటి గాంధీ, వీరంకి డాంగేకుమారి, గరికిపాటి శ్రీనివాస్ బద్రీ, వీరంకి సుబ్బారావు, కాకుమల్లిఖార్జున్ యాదవ్, మల్లెల రామకృష్ణ, దండమూడి సన్నిది, షేక్ షరీఫ్ తదితరులు పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఏపీఎస్ఆర్ఎంసీ ఉన్నత పాఠశాలలో చిన్నారులకు అల్బెండజోల్ మాత్రలను పంపిణీ





**కృష్ణలంక, ఫిబ్రవరి 10, మేజర్ న్యూస్ :** జాతీయ నులిపురుగుల నిర్మూలన కార్యక్రమంలో భాగంగా సోమవారం కృష్ణలంకలోని ఏపీఎస్ఆర్ఎంసీ ఉన్నత పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో విజయవాడ ఆర్‌డీవో కావూరి చైతన్య పాల్గొన్నారు. చిన్నారులకు అల్బెండజోల్ మాత్రలను పంపిణీ చేశారు. ఏడాదికి రెండుసార్లు పిల్లలు, కిశోర బాలలకు అల్బెండజోల్ మాత్రలను పంపిణీ చేయడం జరుగుతోందని.. ఈ మాత్రలు చిన్నారులకు రక్తహీనత సమస్య ఎదురుకాకుండా ఉపయోగపడతాయని వివరించారు. అందువల్ల 1-19 ఏళ్ల చిన్నారులు, కిశోర బాలలు ప్రతిఒక్కరూ అల్బెండజోల్ మాత్రలను తప్పనిసరిగా తీసుకోవాలని సూచించారు



# చివరి ఆయకట్టు వరకు నీరు అందిస్తాం

### పోలంపల్లి మున్నేరు ప్రాజెక్ట్ చైర్మన్ పొన్నం బాలాజీ





**పెనుగంచిప్రోలు, మేజర్ న్యూస్ :** పంటలు చేతికొచ్చే టైంకి నీరు అందక ఇబ్బందిపడుతున్న విషయాన్ని, మాగల్లు, సోమవారం, రుద్రవరం, గొల్లమూడి, పల్లగిరి, గ్రామాల రైతులు, చైర్మన్‌కి వైస్ చైర్మన్ కి తెలియజేయగా స్వయంగా కాలువలు మీద తిరుగుతూ పరిశీలించారు.

ఈ సందర్భంగా పోలంపల్లి మున్నేరు ప్రాజెక్ట్ చైర్మన్ పొన్నం బాలాజీ మాట్లాడుతూ వృధాగా పోయే నీటిని లస్కర్లు, రైతుల సహాయంతో మూయించివేసి చివరి ఆయకట్టు వరకు నీరు అందిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ప్రాజెక్టు వైస్‌చైర్మన్ మౌల ఈశ్వరరావు, వేణుగోపాలకృష్ణ, కృష్ణారెడ్డి, కిరణ్, బిక్కీ వీరభద్రరావు, షేక్ సుభాని, లస్కర్లు, ఆరుదల రమేష్, వివిధ గ్రామాల రైతులు పాల్గొన్నారు.

# ప్రతి ఒక్క ఓటరునీ కలిసి ప్రభుత్వ పని తీరుని వివరించండి

### ఉమ్మడి కృష్ణా,గుంటూరు జిల్లాల పట్టభద్రుల ఎంఎల్సీ ఎన్నికల ఆత్మీయ సమావేశంలో కొమ్మా రెడ్డి పట్టాభిరామ్



**అవనిగడ్డ, మేజర్ న్యూస్ :** మన ముందున్న ప్రధాన కర్తవ్యం ఓటర్ లిస్ట్ విభజన అని అలాగే ఓటర్ల నంబర్ లు కూడా తీసుకుంటే వీలైనంత త్వరగా మనం అనుకున్న లక్ష్యాన్ని ఈజీగా పూర్తి చేయవచ్చని స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ చైర్మన్ కొమ్మా రెడ్డి పట్టాభి రామ్ అన్నారు. స్థానిక గాంధీ క్షేత్రంలో ఏర్పాటు చేసిన ఉమ్మడి కృష్ణా,గుంటూరు జిల్లాల పట్టభద్రుల ఎంఎల్సీ ఎన్నికల ఆత్మీయ సమావేశంలో పాల్గొన్న పట్టాభిరామ్ మాట్లాడుతూ సకల జనుల శ్రేయస్సే ఎన్డీయే కూటమి ధ్యేయం అనే కూటమి విజయాలకి సంబంధించిన కరపత్రాన్ని శాసన సభ్యులు మండలి బుద్ధప్రసాద్,ఇతర కూటమి నాయకులతో కలిసి ఆయన ఆవిష్కరించారు. స్వచ్ఛ రాజకీయాలకి మారుపేరైన సీనియర్ శాసన సభ్యులు మండలి బుద్ధ ప్రసాద్ తో కలిసి ఈ ఎన్నికలకి పని చేయడం సంతోషంగా ఉందని పట్టాభి రామ్ తెలిపారు. ఎన్నికలకి సంబంధించి కూటమి నాయకులు ఇచ్చిన సూచనలు తీసుకుని ఎంఎల్సీ ఎన్నికలనీ దిగ్విజయంగా జరిపించి ఆలపాటి రాజేంద్రప్రసాద్ ని గెలిపించాలని పట్టాభి రామ్ కోరారు. ప్రత్యర్థి లేరు కదా అని ఎన్నికలని తేలిగ్గా తీసుకోవద్దని మనవంతు ప్రయత్నం వంద శాతం చేయాలని అప్పుడే అనుకున్నా గెలుపు సాధ్యం అవుతుందని పట్టాభిరామ్ కోరారు.సాధారణ ఎన్నికలు మాదిరిగా ఎంఎల్సీ ఎన్నికలు ఉండవు కాబట్టి మొట్ట మొదటి సారి ఓటు వేసే వారికి ఒక యానిమేటెడ్ డెమో లాంటివి కూడా ప్రిపేర్ చేసి ఓటర్లకు అవగాహన కల్పించాలని పట్టాభి రామ్ ఆదేశాలు జారీ చేశారు.మరొక రెండు వారాల్లో ఎన్నికల ప్రచారం కూడా ముగియబోతుందని కాబట్టి మనం అనుకున్నట్టుగా ప్రతి ముప్పయి ఓటర్లకు ఏర్పాటు చేసుకున్న కోఆర్డినేటర్ ఎవరైతే ఉన్నారో వాళ్లు తప్పనిసరిగా ఓటర్లలో ఫోన్ లలో కానీ లేదా వీలైతే ప్రత్యక్షంగా కలుస్తూ ఓటు వేసే చివరి నిమిషం వరకు జాగ్రత్తగా వ్యవహరించాలని పట్టాభిరామ్ కోరారు..తెనాలిలో ఒక గుర్తింపు ఉన్న నాయకుడిగా కొన్ని దఫాలుగా శాసన సభ్యుడిగా ఎన్నికవుతూ గడచిన ఎన్నికల్లో మాత్రం కూటమి అభ్యర్థి అయిన నాదెండ్ల మనోహర్ కోసం తన సీటును వదులుకున్న గొప్ప వ్యక్తి ఆలపాటి రాజేంద్ర ప్రసాద్ అని పట్టాభిరామ్ తెలిపారు. గత ఎన్నికల్లో ఘోర ప్రభావం చెందిన సమయం లో చాలామంది నాయకులు కానీ కార్యకర్తలు కానీ బయటకి రాలేని సమయంలో కూడా ఆలపాటి రాజేంద్రప్రసాద్ లాంటి వ్యక్తి బయటకి వచ్చి సమస్యలపై పోరాడారని అలాంటి వ్యక్తిని మనం చట్ట సభలకి పంపవలసిన అవసరం ఉందని,ప్రజలకి గడచిన ఏడు నెలల్లో ప్రభుత్వం చేసిన మేలుని వివరించి పట్ట భద్రుల ఎంఎల్సీ ఎన్నికల్లో ఆలపాటి రాజేంద్ర ప్రసాద్ నీ గెలిపించాలని దీనికి ప్రతి ఒక్క కూటమి నాయకుడు బాధ్యత తీసుకోవాలని పట్టాభి కోరారు..ఈ కార్యక్రమంలో నియోజకవర్గ శాసన సభ్యులు మండలి బుద్ధ ప్రసాద్,యువ నాయకులు మండలి వెంకట్రాం, నియోజకవర్గ టీడీపీ పరిశీలకుడు కనపర్తి శ్రీనివాసరావు, జనసేన జిల్లా ఉపాధ్యక్షుడు మత్తి వెంకటేశ్వరరావు, తెలుగుదేశం నాయకులు యాసం చిట్టిబాబు ఇతర కూటమి నాయకులు పాల్గొన్నారు



18 వసంతాల 'సూర్య' మహాయజ్ఞంలో 'సూర్య' అక్షర సైనికుల భాగస్వామ్యంతో అనితర సాధ్యం కాని ఎన్నో లక్ష్యాలను అధిగమించింది. ఈ ప్రస్థానంలో సూర్యాక్షరంతో మమేకమైన 'సూర్య' కుటుంబ సభ్యులందరికీ అక్షర నమస్సులు. మాకు తోడుగా నిలుస్తున్న పాఠకులకు, మిత్రులకు, శ్రేయోభిలాషులకు పేరుపేరున కృతజ్ఞతాభివందనాలు.

ఇట్లు ఎన్.వెంకట్, ఎన్టీఆర్ - కృష్ణా బ్యూరో
ఫోన్ : 9642 980 999